


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX



## అబద్దాలకు పేటెంట్ రేవంత్



2లో


ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 185 | శనివారం 11- 07 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028



## సోషల్ మీడియా దుర్వినియోగంపై

# ఉక్కుపాదం

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ
- కీలక నిర్ణయాలకు ఆమోదం
- సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు
- రూ.31,431 కోట్ల విలువైన పెట్టుబడులకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం
- అమరావతిలో భూములిచ్చిన రైతులకు వార్షిక కౌలు పెంపు.. కీలక నిర్ణయం
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం మూడు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు
- రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు సరికొత్త విధానానికి గ్రీన్ సిగ్నల్

2లో

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. రాష్ట్ర ఆర్థిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, అమరావతి నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు, సోషల్ మీడియా నియంత్రణ వంటి అనేక అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు. సోషల్ మీడియా దుర్వినియోగాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న ప్రభుత్వం, దానిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోబోతోందని ఆయన స్పష్టం చేశారు.సమాజానికి సోషల్ మీడియా దుర్వినియోగం ఒక రోగంలా పరిణమించిందని, దాని వల్ల మేలు కంటే కీడే ఎక్కువగా

## గృహోపకరణాల యూనిట్ ఏర్పాటు చేయండి

### కుకూ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులతో మంత్రి లోకేశ్



2లో

రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ఏపీ మంత్రి నారా లోకేశ్ దక్షిణకొరియా పర్యటన ఆరోరోజు కొనసాగుతోంది. ఈ సందర్భంగా గృహోపకరణాలు, నీరు, గాలి శుద్ధి పరికరాల సంస్థ కుకూ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులతో మంత్రి భేటీ అయ్యారు. శ్రీసిటీలోని గృహోపకరణాల క్లస్టర్‌లో అంబర్, ఈప్యాక్ డ్యూరబుల్, డైకిన్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ మొదలైనవి సంస్థలు ఉన్నాయని లోకేశ్ తెలిపారు. దేశంలో 40శాతం ఏసీలు, 35శాతం టీవీలు ఆంధ్రప్రదేశ్‌లో తయారవుతున్నాయన్నారు. ఇందుకు అవసరమైన స్కిల్డ్ వర్క్ ఫోర్స్ అందుబాటులో ఉందని వివరించారు. ఇక్కడి నుంచి ఆగ్నేయ, మధ్యప్రాచ్య దేశాలకు ఎగుమతి చేయడం సులభమన్నారు. దక్షిణ భారతదేశంలో ఏసీల వినియోగం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రపంచ వాణిజ్యానికి భారతదేశం ఒక విశ్వసనీయ తయారీ భాగస్వామిగా ఉందని తెలిపారు. ఈ అనుకూలతల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో లేదా తిరుపతిలో..

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న విజయ్.. 32 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు

- కరూర్ తొక్కిసలాట బాధితులకు నియామక పత్రాలు అందించిన ముఖ్యమంత్రి
- బాధితుల కష్టాలు చూసి భావోద్వేగానికి గురైన ముఖ్యమంత్రి
- బాధితుల స్మారకార్థం మెమోరియల్ నిర్మిస్తామని ప్రకటన
- కొనసాగుతున్న సీబీఐ విచారణ, ప్రతిపక్షాల విమర్శలు

2లో



## సోషల్ మీడియాలో అతికి కళ్లెం

- సమాజానికి నష్టం కలిగించేలా తయారైన రోగం
- అసత్యాలతో రాజకీయ బురదజల్లుతున్న ప్రచారం
- ఆధునిక ఫోరెన్సిక్ టూల్స్ సమకూర్చే ఆలోచన
- ప్రపంచ వ్యాప్తంగా కఠిన చర్యలు

2లో



## రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల ధర్నా

కనీస వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ సకర్యాలపై పోరుబాట

2లో



# ‘అన్న రాజ్యం‘ కాదు.. ‘అక్క రాజ్యం‘

- తమ ప్రభుత్వం వస్తే రైతును రాజును చేస్తానన్న కవిత
- పాంచజన్యం అనే నినాదంతో ముందుకు సాగుతామని వెల్లడి
- గిరిజనుల హక్కుల సాధన కోసమే పార్టీ పెట్టానన్న కవిత

2లో



తెలంగాణ రక్షణ సేన ఎన్నికల్లో విజయం సాధిస్తే ‘అన్న రాజ్యం‘ కాదు.. ‘అక్క రాజ్యం‘ ఎలా ఉంటుందో రుచి చూపిస్తానని ఆ పార్టీ అధ్యక్షురాలు కవిత అన్నారు. రైతును నిజమైన రాజును చేస్తానని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ఏర్పడగానే ప్రతి ప్రభుత్వ ఆఫీసులో రైతులకు ప్రత్యేక గౌరవ కుర్చీలు ఏర్పాటు చేస్తామన్నారు. మహిళల కోసం ఒక వినూత్న ఆలోచన చేశామని... త్వరలోనే దాని వివరాలు ప్రకటిస్తానని చెప్పారు. ‘పాంచజన్యం‘ అనే నినాదంతో మార్పు కోసం ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

## ఖరీఫ్‌కు సమృద్ధిగా ఎరువుల నిల్వలు

- బఫర్ స్టాక్‌తో ప్రభుత్వం అప్రమత్తం
- రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల సరఫరా కొనసాగుతోంది
- రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు
- మంత్రి అచ్చెన్నాయుడు



2లో

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియా, డీఏపీతో పాటు అన్ని రకాల ఎరువులను ప్రభుత్వం సమృద్ధిగా అందుబాటులో ఉంచిందని రాష్ట్ర వ్యవసాయ

## మధిరలో ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు



2లో

## డిప్యూటి సిఎం అభ్యర్థనతో సిఎం రేవంత్ అంగీకారం

ఖమ్మం జిల్లా మధిరలో ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటుకు సిఎం రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారు. డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి మేరకు కాలేజీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా భట్టి కోర్కెను అభినందించారు. పేదలు చదువుకునేందుకు కోరిన చిన్న కోర్కెగా అభివర్ణించారు. చింతకాని మండలం జగన్నాథపురంలో రైతు ఆశీర్వాద సభకు ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్కడి సభను ఉద్దేశించి ప్రసంగించారు. చివరలో భట్టి విక్రమార్క చేసిన విజ్ఞప్తి మేరకు కాలేజీ ఏర్పాటును అంగీకరించారు. ఈ సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసన మండలి చైర్మన్

# ఏపీలో మళ్లీ కరోనా కలకలం..

## కడప, రాజంపేటల్లో కోవిడ్ లక్షణాలతో ఇద్దరి మృతి!



- ఏపీలో మళ్లీ కలకలం రేపుతున్న కరోనా
- తీవ్ర కరోనా లక్షణాలతో చికిత్స పొందుతూ ఇద్దరి మృతి
- ప్రైమరీ కాంటాక్ట్స్ వివరాలను సేకరిస్తున్న మెడికల్ టీమ్స్

2లో

## నా నోరు మూయించాలంటే.. నన్ను చంపాలి



2లో

# సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం...

జరుగుతోందని కేబినెట్ అభిప్రాయపడింది. వ్యక్తిత్వ హననం, ప్రభుత్వాలపై అబద్ధపు ప్రచారం, మహిళలను కించపరచడం వంటివి శ్రుతిమించుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో అనైతిక కార్యకలాపాలను ఏమాత్రం ఉపేక్షించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని మంత్రి పార్థసారథి తెలిపారు. దీని కోసం కొన్ని కీలక చర్యలను కేబినెట్ ఆమోదించిందని వివరించారు.

రాష్ట్ర స్థాయిలో ఒక 'సోషల్ మీడియా రెస్పాన్స్ సెల్' ఏర్పాటు దుర్వినియోగం, విద్వేష ప్రచారాలను అరికట్టేందుకు 'రాష్ట్ర స్థాయి టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు.

విద్వేషాలు వ్యాప్తి చేసే హ్యాండిల్స్‌ను గుర్తించడానికి ఆధునిక ఫొరెన్సిక్ టూల్స్ కొనుగోలుకు నిధులు. సోషల్ మీడియా కేసుల దర్యాప్తుపై ఎస్‌హెచ్‌ఓలకు ప్రత్యేక శిక్షణ, సైబర్ పరిజ్ఞానం ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (పీపీల) నియామకం. ఇతర దేశాల్లోని చట్టాలను అధ్యయనం చేసి, అవసరమైతే ప్రత్యేక చట్టం తీసుకురావడంపై పరిశీలన.

**భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్** రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచే లక్ష్యంతో స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ (రాప్రుదీ) ఆమోదించిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 13 ప్రాజెక్టులకు సంబంధించి రూ.31,431 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటి ద్వారా రాష్ట్రంలో 31,431 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తిరుపతి జిల్లా శ్రీసిటీలో మాండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1801 కోట్లతో ఏర్పాటు చేయనున్న చాక్లెట్ తయారీ యూనిట్ వీటన్నింటిలో ముఖ్యమైనది. ఈ యూనిట్ ద్వారా దేశంలోనే కోకో వినియోగించి చాక్లెట్లు తయారు చేయడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానానికి చేరుకుంటుందని మంత్రి వివరించారు. అలాగే వేస్ట్ ఆయిల్స్‌ను ఏవియేషన్ ఫ్యూయల్‌గా మార్చేందుకు ఎస్ఏఎఫ్ఎఫ్ ఇండియా ఏర్పాటు చేయనున్న పరిశ్రమకు కూడా ఆమోదం తెలిపారు.

**అమరావతిపై కీలక నిర్ణయాలు** అమరావతికి సంబంధించి కేబినెట్ పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. రాజధానిలో భూములు ఇచ్చిన రైతులకు ఊరట కల్పిస్తూ వార్షిక కౌలును పెంచింది. జూన్ 12, 2024 తర్వాత ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద భూములు ఇచ్చిన రైతులకు ఈ పెంపు వర్తిస్తుంది. మెట్ట భూములకు ఎకరాకు రూ.30,000 నుంచి రూ.40,000కు, జరీబు భూములకు రూ.50,000 నుంచి రూ.60,000కు వార్షిక కౌలును పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. వీరికి 10 సంవత్సరాల పాటు ఈ కౌలు చెల్లిస్తారు. అలాగే, గ్రామ కంఠాల్లో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇచ్చే నెలవారీ పరిహారాన్ని రూ.5,000 నుంచి రూ.10,000కు పెంచుతూ 12 నెలల పాటు అందించాలని తీర్మానించారు. వీటితో పాటు, అమరావతిలో నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు, ఈషా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ వంటి సంస్థలకు భూ కేటాయింపులకు ఆమోదం తెలిపారు. ముఖ్యంగా, నేషనల్ ఫిషరీస్ బోర్డు ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో అక్వేరియం, ఆర్నమెంటల్ ఫిష్ బ్రీడింగ్ సెంటర్ ఏర్పాటు కానుంది.

**విద్యారంగానికి పెద్దపీట** సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదివే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఐఐటీ-జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు మూడు "సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్" ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిని విశాఖపట్నం, నెల్లూరు, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఏర్పాటు చేస్తారు. కార్పొరేట్ సంస్థలకు దీటుగా నాణ్యమైన శిక్షణ ఇచ్చి, పేద విద్యార్థులను ఐఐటీలు, ఐఐఎంలలో సీట్లు సాధించేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి పార్థసారథి తెలిపారు.

**టూరిజం ప్రోత్సాహానికి కొత్త పాలసీ** ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రధాన పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం నూతన విధానాన్ని ప్రకటించింది. రాష్ట్రంలో సంగీత కచేరీలు (జశీఅషవతీం), కార్నివాల్స్ వంటి భారీ ఈవెంట్లను నిర్వహించే వారికి 'వయబిలిటీ గ్యాప్ ఫండింగ్' కింద ఆర్థిక సహాయం అందించనుంది. 20,000 మంది లోపు హాజరైతే రూ.2 కోట్లు, 20,000 నుంచి 50,000 మధ్య హాజరైతే రూ.5 కోట్లు, 50,000 దాటితే రూ.5 కోట్ల వరకు ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తుంది. దీనికి తోడు, ప్రభుత్వ ఆధీనంలోని పెద్ద మైదానాలను ఉచితంగా వాడుకునేందుకు కూడా అవకాశం కల్పిస్తుంది.

**సాగునీటి ప్రాజెక్టులు, జల సంరక్షణ** సాగు, తాగునీటి ప్రాజెక్టులపై కేబినెట్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. పెద్దగడ్డ రిజర్వాయర్ ప్రాజెక్టు పనులకు సంబంధించి ఐదుసార్లు టెండర్లు విఫలమైన నేపథ్యంలో, 14.88 శాతం ఎక్కువకు కోట్ చేసిన టెండర్‌ను ఆమోదించింది. కుప్పం బ్రాంచ్ కెనాల్ నుంచి చెరువులకు నీటిని అందించే పనులకు రూ.67.98 కోట్లకు పరిపాలన ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా 'జలధార' కార్యక్రమం పురోగతిని సమీక్షించాలని, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తాగునీరు, పశుగ్రాసంపై ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు.

**భూ సమస్యల పరిష్కారానికి చర్యలు** దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

గుంటూరు జిల్లా పుల్లడిగుంట గ్రామంలో దశాబ్దాలుగా నివసిస్తున్న 200 కుటుంబాలకు ఊరట కల్పిస్తూ, వారు నివసిస్తున్న 10.16 ఎకరాల 'తోపు పోరంబోకు' భూమిని పట్టా భూమిగా మార్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ఇలాంటి భూ వర్గీకరణ సమస్యలతో ఇబ్బంది పడుతున్న వేలాది కుటుంబాలకు న్యాయం చేస్తామని, మార్చి 2027 నాటికి పరిష్కరించగల అన్ని రెవెన్యూ సమస్యలను పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారని మంత్రి పేర్కొన్నారు.

## గృహోపకరణాల యూనిట్ ఏర్పాటు చేయండి

గృహోపకరణాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాల్సిందిగా మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలు పరిశీలిస్తామని కుకూ ఎలక్ట్రానిక్స్ హెచ్‌వోడీ చెప్పారు. దక్షిణ కొరియాకు చెందిన ఆటోమోటివ్ పవర్ ఎలక్ట్రానిక్స్, పాసివ్ కాంపొనెంట్స్ తయారీ సంస్థ మోటివ్ లింక్ సీఈవో కిమ్ కి-హాన్ , ఇంటర్నేషనల్ సేల్స్ అండ్ రీసెర్చ్ జనరల్ మేనేజర్ బైద్య శర్మతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న విజయ్..
## 32 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు

గతేడాది టీవీకే ర్యాలీలో చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనలో మరణించిన వారి కుటుంబాలను తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ పరామర్శించారు. ఈ దుర్ఘటన జరిగి దాదాపు ఏడాది పూర్తవుతోంది. ఈ తరుణంలో, శుక్రవారం ఆయన కరూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా బాధితుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలను ఆయన స్వయంగా అందజేశారు. కరూర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, బాధిత కుటుంబాల్లోని అర్హులైన 32 మందికి వారి విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగాలను కేటాయించారు. ఇందులో జూనియర్ అసిస్టెంట్ పోస్టులతో పాటు ఎస్పీ కార్యాలయంలోని వివిధ విభాగాల్లో నియామకాలు జరిగాయి. బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడిన సమయంలో ముఖ్యమంత్రి విజయ్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారని, తమ గోడు విని ఆయన కంటతడి పెట్టుకున్నారని బాధితురాలు ధనలక్ష్మి పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో భర్తను కోల్పోయిన నివేదిక అనే మహిళకు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం లభించగా, ఈ నియామకం తమ కుటుంబ భవిష్యత్తుకు భరోసా కల్పిస్తుందని ఆమె కృతజ్ఞతలు తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ. 10 లక్షల పరిహారం అందజేయగా, టీవీకే పార్టీ తరఫున ఒక్కో కుటుంబానికి రూ. 20 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ, కరూర్ తొక్కిసలాట ఘటన తన జీవితంలో ఒక మాయని గాయమని, అత్యంత బాధాకరమైన అనుభవమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాటి ర్యాలీలో పోలీసుల భద్రతా ఏర్పాట్లను విశ్వసించానని, అయితే జన నియంత్రణలో వైఫల్యాలు ఎందుకు చోటుచేసుకున్నాయన్న అంశంపై సమీక్షిస్తున్నట్లు తెలిపారు. మృతుల జ్ఞాపకార్థం పార్టీ తరఫున ఒక స్మారక చిహ్నాన్ని నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## సోషల్ మీడియాలో అతికి కళ్లెం

సోషల్ మీడియా వల్ల సమాజానికి ఉపయోగంతో పాటు తీవ్ర నష్టం కలిగించే 'రోగంగా' మారుతోందని ఎపి కేబినెట్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు కేబినేట్ వివరాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కె. పార్థసారథి తెలిపారు. సోషల్ మీడియా ప్రభావంతో ప్రజల ఆలోచనా విధానం, పాలనా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతోందని కేబినెట్‌లో చర్చ జరిగిందని చెప్పారు. శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం వివరాలను మంత్రి పార్థసారథి విలేకర్ల సమావేశంలో వివరించారు. విద్వేష ప్రచారం, వ్యక్తిత్వ హననం చేసే సోషల్ మీడియా హ్యాండిల్స్‌ను గుర్తించేందుకు ఆధునిక ఫోరెన్సిక్ టూల్స్ సమకూర్చాలని ఈ కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పార్థసారథి తెలిపారు. సోషల్ మీడియా దుర్వినియోగంపై అన్ని ఎస్‌హెచ్‌ఓలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సీఎం సూచించారని పేర్కొన్నారు. సైబర్ ఇన్వెస్టిగేషన్‌లో నైపుణ్యం కలిగిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లను అవసరమైతే నియమించాలని సీఎం చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారని చెప్పారు. ప్రపంచంలోని అనేక దేశాలు సోషల్ మీడియా నియంత్రణకు కఠిన చట్టాలు అమలు చేస్తున్నాయన్న అంశంపై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ప్రజెంటేషన్ ఇచ్చారని అన్నారు. సంప్రదాయ మీడియాకు ఉన్న జవాబుదారీతనం, నైతిక విలువలు సోషల్ మీడియాలో కనిపించడం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం, ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం, అసత్య సమాచారం పెరుగుతోందని ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాను రాజకీయ ప్రత్యర్థులపై దాడులు, అసత్య ప్రచారం కోసం కొందరు దుర్వినియోగం చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఇటువంటి కార్యకలాపాలకు కొన్ని రాజకీయ పార్టీలు కూడా ఆర్థిక సహకారం అందిస్తున్నాయని విమర్శించారు. సోషల్ మీడియా దుర్వినియోగంపై డీజీపీ, పోలీసు అధికారులు క్యాబినెట్‌కు సమగ్ర నివేదిక సమర్పించారని పేర్కొన్నారు. విదేశాల్లో అమలులో ఉన్న సోషల్ మీడియా చట్టాలు, భారత ఐటీ చట్టంలోని లోపాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించినట్లు వివరించారు. మహిళలను, బాలికలను కించపరిచే పోస్టులు, వ్యక్తిత్వ హననం, ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాన్ని ప్రభుత్వం సహించదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారని తెలిపారు. సోషల్ మీడియా దుర్వినియోగంపై చట్టాలను మరింత బలోపేతం చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం ఆదేశించారని చెప్పారు. రాష్ట్ర స్థాయి సోషల్ మీడియా రెస్పాన్స్ సెల్ ఏర్పాటు చేయాలని ఈ భేటీలో నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. సోషల్ మీడియా దుర్వినియోగం, ఫిర్యాదుల పరిష్కారానికి రాష్ట్ర స్థాయిలో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. సోషల్ మీడియా దుర్వినియోగ నియంత్రణపై దేశ, విదేశాల్లో అమలులో ఉన్న ఉత్తమ విధానాలపై గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జీఓఎం) అధ్యయనం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు మంత్రి కొలుసు పార్థసారథి వివరించారు.

## 'అన్న రాజ్యం' కాదు.. 'అక్క రాజ్యం'

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని కొత్త గంగారం తదితర ఆదివాసి గ్రామాల్లో పర్యటించిన కవిత, స్థానికుల జీవన విధానాన్ని, సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వెనకబడిన గిరిజనుల హక్కుల సాధన కోసమే తాను తెలంగాణ రక్షణ సేనను స్థాపించానని, ఇక్కడికి వచ్చింది రాజకీయాల కోసం కాదని, ప్రజా సమస్యల పరిష్కారం కోసమేనని స్పష్టం చేశారు. 1950 రికార్డుల్లో నాయకపోడు తెగ పేరు లేకపోవడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల హక్కుల సాధనకై అవసరమైతే ఢిల్లీ వేదికగా పోరాడతామన్నారు. కార్పొరేట్ శక్తుల వేల కోట్ల అప్పులు మాఫీ చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం... ఆదివాసి బిడ్డలు బైక్ కొందామన్నా బ్యాంక్ లోన్లు ఎందుకు ఇవ్వడం లేదని కవిత నిలదీశారు. విదేశాల తరహాలోనే ఇక్కడి గిరిజనులకు కూడా రూ.2 లక్షల నుండి రూ.2 కోట్ల వరకు సులభంగా లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని ఆరోపించిన ఆమె, ఆదివాసి పిల్లలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించడం వారి ప్రాథమిక హక్కు అని గుర్తుచేశారు. ఏది సాధించాలన్నా ముందు ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుందని... అందరి సహకారం తనకు కావాలని కోరారు.

## నా నోరు మూయించాలంటే..
## నన్ను చంపాలి

**అభిషేక్, మహువా, కల్యాణ్ బెనర్జీలను లక్ష్యంగా చేసుకున్నారని మమత ఆరోపణ**

**2026 బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ ఓట్లను దోచుకుని అధికారంలోకి వచ్చిందని విమర్శ**

**టీఎంసీ నేతల ఫిరాయింపుల మధ్య వీడియో సందేశం విడుదల చేసిన మమత**

**టీఎంసీకి రాజీనామా చేసిన ముగ్గురు రాజ్యసభ సభ్యులు బీజేపీలో చేరిక**

పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ ఎదుర్కొంటున్న అంతర్గత సంక్షోభం మధ్య ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బీజేపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తన నోరు మూయించాలంటే తనను చంపాల్సిందేనని వ్యాఖ్యానించారు. పార్టీ నేతలను భయపెట్టేందుకు, వేధించేందుకు బీజేపీ అన్ని ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. వీడియో సందేశం ద్వారా మాట్లాడిన మమతా బెనర్జీ.. టీఎంసీని వీడి బీజేపీలో చేరని వారికి శుభాకాంక్షలు తెలిపారు. తనపై, పార్టీపై ఒత్తిడి తెచ్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ.. "నన్ను మౌనంగా చేయాలంటే నన్ను చంపాల్సిందే. అందుకోసం కూడా మీరు ఎలాంటి ప్రయత్నాలు చేయకుండా వదల్లేదు" అని వ్యాఖ్యానించారు. లోక్‌సభ సభ్యులు అభిషేక్ బెనర్జీ, మహువా మొయిత్రా, కల్యాణ్ బెనర్జీలతో పాటు తన ఇంటిని కూడా లక్ష్యంగా చేసుకున్నారని మమత ఆరోపించారు. తమ పార్టీ నాయకులను నిరంతరం వేధిస్తున్నారని విమర్శించారు. 2026 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అక్రమాలకు పాల్పడి అధికారంలోకి వచ్చిందని మమత ఆరోపించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియను దుర్వినియోగం చేసి, కేంద్ర బలగాల సహాయంతో కౌంటింగ్ కేంద్రాలను స్వాధీనం చేసుకుని ఎన్నికలను ప్రభావితం చేసిందని విమర్శించారు. దీనికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఘోర పరాజయం అనంతరం ఆ పార్టీలో సంక్షోభం మరింత తీవ్రరూపం దాల్చిన విషయం తెలిసిందే. పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీని వీడగా, కొందరు పార్టీ నాయకత్వం, ముఖ్యంగా అభిషేక్ బెనర్జీపై విమర్శలు చేశారు. పార్టీలో అవినీతి పెరిగిందని కూడా ఆరోపించారు. మరోవైపు టీఎంసీకి రాజీనామా చేసిన రాజ్యసభ సభ్యులు సుఖేందు శేఖర్ రాయ్, సుష్మితా దేవ్, ప్రకాశ్ చిక్ బరైక్ గురువారం బీజేపీలో చేరారు. అనంతరం జులై 24న జరగనున్న రాజ్యసభ ఉప ఎన్నికలకు బీజేపీ వారిని అభ్యర్థులుగా ప్రకటించింది.

## ఏపీలో మళ్లీ
## కరోనా కలకలం..

ప్రపంచాన్ని ఒకప్పుడు వణికించిన కరోనా వైరస్ ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ కలకలం రేపుతోంది. తాజాగా కడప జిల్లాలో కోవిడ్ తరహా లక్షణాలతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందడం స్థానికంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వివరాల్లోకి వెళితే... జిల్లాలో ఇటీవల కొందరికి అనుమానంతో చేసిన ఆర్టీపీసీఆర్ పరీక్షల్లో ఐదుగురికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఇదిలా ఉండగా, కడప నగరంతో పాటు రాజంపేట ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తీవ్రమైన కరోనా లక్షణాలతో బాధపడుతూ, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఒకేసారి ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో అప్రమత్తమైన ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. కడప, రాజంపేటల్లోని బాధిత ప్రాంతాలలో స్పెషల్ మెడికల్ టీమ్స్ పర్యటిస్తున్నాయి. మృతుల కుటుంబ సభ్యులతో పాటు, వారితో ప్రాథమికంగా పరిచయం ఉన్నవారి (ప్రైమరీ కాంటాక్స్) వివరాలను సేకరిస్తున్నారు. స్థానికంగా ఎవరికైనా జ్వరం, దగ్గు, శ్వాసకోస సమస్యలు ఉన్నాయా అనే అంశంపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. మరణానికి గల కచ్చితమైన కారణాలు, వైరస్ యొక్క కొత్త వేరియంట్ ఏమైనా ఉందా అనే కోణాన్ని నిర్ధారించుకోవడానికి బాధితుల నమూనాలను సేకరించి, పూణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ ల్యాబ్‌కు పంపించారు. అయితే, జిల్లాలో కరోనా వైరస్ వ్యాప్తి, ఈ మరణాలపై వైద్య ఆరోగ్య శాఖ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయకపోవడం గమనార్హం. అధికారులు అధికారికంగా నిర్ధారించే వరకు ప్రజలు భయాందోళనలకు గురికాకుండా, అవసరమైన జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

## ఖరీఫ్‌కు సమృద్ధిగా ఎరువుల నిల్వలు

శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం జులై 10వ తేదీ నాటికి 3.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, 0.90 లక్షల మెట్రిక్ టన్నుల డీఏపీ నిల్వలు అందుబాటులో ఉన్నాయని శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మంత్రి మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాల వారీగా మార్క్‌ఫెడ్ గోదాముల్లో తగిన బఫర్ స్టాక్‌ను నిల్వ ఉంచామని, ఎక్కడైనా నిల్వలు తగ్గిన వెంటనే అదనపు ఎరువులను తరలించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. చాలా కంపెనీల నుంచి ఎరువుల స్టాక్‌ను వ్యవసాయ శాఖ స్వాధీనం చేసుకుని ప్రభుత్వ గోదాముల్లో భద్రపరుస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 3,69,646 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉండగా, ఇది ఖరీఫ్ అవసరాల్లో 85 శాతం మేరకు సరిపోతుందని మంత్రి తెలిపారు. అలాగే 85,683 మెట్రిక్ టన్నుల డీఏపీ నిల్వలు ఉండగా, ఇది ప్రస్తుత సీజన్ అవసరాల్లో 64 శాతం మేర అందుబాటులో ఉందన్నారు. అవసరానికి అనుగుణంగా నిరంతరం అదనపు ర్యాకులు రాష్ట్రానికి చేరుతున్నాయని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా సరఫరా కొనసాగుతోందని స్పష్టం చేశారు. యూరియా నిల్వల పరంగా అన్ని జిల్లాల్లో అవసరమైన బఫర్ స్టాక్‌ను ఉంచామని, డీఏపీ పంపిణీ కూడా ప్రణాళిక ప్రకారం కొనసాగుతోందని తెలిపారు. జిల్లాల వారీగా నిల్వలు, వినియోగాన్ని ప్రతిరోజూ సమీక్షిస్తూ అవసరమైన చోట వెంటనే అదనపు నిల్వలు తరలిస్తున్నామని చెప్పారు. విజయనగరం జిల్లాలోని ఆర్. అముదాలవలస మండలం సంకిలి రైతు సేవా కేంద్రం వద్ద జరిగిన ఘటనపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. సంకిలి ఆర్ఎస్‌కే పరిధిలో 731 ఎకరాల వరి, 90 ఎకరాల ఉద్యాన పంటలు, 80 ఎకరాల చెరకు సాగు పరిధి ఉండగా, ప్రస్తుతం 90 ఎకరాల వరి, 80 ఎకరాల చెరకు మాత్రమే సాగు జరిగిందన్నారు. ఈ ఆర్ఎస్‌కే పరిధిలోని సంకిలి, చిన్నయ్యపేట, బొడ్డవలస, అప్పాపురం, ఎం.ఆర్.పేట గ్రామాలకు తొలి దఫా అవసరంగా 811 బస్తాల యూరియా అవసరమని తెలిపారు. ఇప్పటికే బొడ్డవలస, అప్పాపురం గ్రామాలకు 225 బస్తాలు పంపిణీ పూర్తయిందని, మిగిలిన గ్రామాలకు 219 బస్తాల పంపిణీని యూరియా కార్డులు, ఒఖంఎటూ ద్వారా చేపట్టే సమయంలో రైతులు పెద్ద సంఖ్యలో రావడంతో అదనపు డిమాండ్ ఏర్పడిందన్నారు. అదనంగా వెంటనే 444 బస్తాల యూరియాను సమీప రైతు సేవా కేంద్రం నుంచి తెప్పించి అదే రోజు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించి, టోకెన్ విధానం, క్యూలైన్ ఏర్పాటు చేసి పంపిణీని కొనసాగిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో 9,987 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు, అందులో మార్క్‌ఫెడ్ వద్ద 4,850 మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్ అందుబాటులో ఉందని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత లేదని, కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. రైతులు అలాంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దని, అవసరమైన ఎరువులను ప్రభుత్వం సమయానికి అందిస్తుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ యంత్రాంగం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

## మధిరలో ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు

గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, రామసాయం రఘురాం రెడ్డి, బలరాం నాయక్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు. ఇదే వేదిక నుంచి రతు భరోసా నిధుల విడుదలతో పాటు రైతులకు ఈ-పట్టాదార్ పాస్‌బుక్స్ జారీ చేసారు.1.44 లక్షల మంది రైతుల ఖాతాల్లో 1009.15 కోట్లు జమ చేశారు. తాజా విడుదలతో కలిపి రాష్ట్రంలో ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేసిన మొత్తం రైతు భరోసా సాయం రూ. 8,759 కోట్లకు చేరింది. రాష్ట్రవ్యాప్తంగా సాగు చేస్తున్న రైతులకు ఆర్థికంగా అండగా నిలవడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిధులను ఎప్పటికప్పుడు కేటాయిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఈ ఆర్థిక సాయం ద్వారా ఇప్పటివరకు దాదాపు 74 లక్షల మంది రైతులకు నేరుగా లబ్ది చేకూరింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1.45 కోట్ల ఎకరాల సాగు భూములకు గానూ మొత్తం రూ. 7,750 కోట్ల పెట్టుబడి సాయాన్ని అందించినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.




## రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల ధర్నా

రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు కనీసవేతనం రూ. 26 వేలతో పాటు పెన్షన్, వైద్యసదుపాయం కల్పించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు ఆందోళనకు దిగారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌ల వద్ద నిరసనలు చేపట్టారు. విశాఖ జగదాంబ జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. విజయవాడ ధర్నాచౌక్ వద్ద ఆందోళన చేపట్టారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు ఆందోళన చేపట్టారు. అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ప్రకటించిన విధంగా జీతాన్ని వెంటనే పెంచి కార్యకర్తలపై రాజకీయ వేధింపులను ఆపాలని కోరారు. ప్రస్తుతం వాడుతున్న నవచేతన యాప్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతిలో జిల్లా కలెక్టరేట్ ఎదుట అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నిరసన చేపట్టారు.సీ.ఐ.టీ.యు నేత కందారపు మురళి నేతృత్వంలో తిరుపతి జిల్లా కలెక్టరేట్ ఎదుట వేలాది మంది అంగన్వాడి వర్కర్లు తో రిలే నిరాహారదీక్ష చేపట్టారు.అంగన్వాడి వర్కర్ లకు ఈ.ఎస్. ఐ, పి.ఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. సంక్షేమ పథకాలు అంగన్వాడి వర్కర్ లకు అందించాలన్నారు. కాగా ప్రభుత్వం అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలతో పాటు పెన్షన్, పిఎఫ్ ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు ఈ రోజు రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపట్టారు. పేద గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు సేవలందిస్తున్నారని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ నిరసనలకు పిలుపిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో 55,607 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు, 48,770 మినీ కేంద్రాలు ఉన్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం అంగన్‌వాడీలకు రూ.26 వేల కనీస వేతనం, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. అంగన్‌వాడీల వేతనాలను పీఆర్సీకి అనుసంధానం చేయడంతో పాటు, గుజరాత్ హైకోర్టు తీర్పునకు అనుగుణంగా జీతాలు పెంచాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి. హెల్పర్ల ప్రమోషన్‌కు 5 ఏళ్ల సీనియారిటీ నిబంధనను రద్దు చేయాలని అన్నారు. అంగన్‌వాడీలకు 'తల్లికి వందనం' సహా అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్నారు. సిగ్నల్ సమస్యలతో తీవ్ర ఇబ్బంది పెడుతున్న ముఖ గుర్తింపు ఫేస్ యాప్‌ను, పనిభారం పెంచే నవచేతన యాప్‌ను తక్షణమే రద్దు చేయాలి. పెండింగ్‌లో ఉన్న టీఏ, మెయింటినెన్స్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

### అబద్ధాలకు పేటెంట్ రేవంత్

ఖమ్మం జిల్లాలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. మాట తప్పడం, పార్టీలు మారడం రేవంత్‌రెడ్డి సంస్కృతి అని.. తనది కాదని విమర్శించారు. తమ ఇద్దరి రాజకీయ చరిత్రే దీనికి నిదర్శనమన్నారు. రేవంత్‌రెడ్డిలా ఒట్టు వేసి ఓ మాట.. వేయకుండా ఓ మాట చెప్పను. భద్రాద్రి రాముడి సాక్షిగా సంపూర్ణ రుణమాఫీ చేస్తానన్న హామీ ఏమైందని నిలదీసారు.

# పీఎం-అజయ్ పథకం కింద చేపడుతున్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలి



## గ్రామాల్లో తాగునీటి సౌకర్యాలకే అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి

### కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** ప్రధాన మంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ్ యోజన (గ్రావీ-సాజీయ్) కింద ఎంపికైన గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిధులను సకాలంలో వినియోగించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ప్రధాన మంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ్ యోజన పథకం అమలు కోసం జిల్లా స్థాయి ప్రాజెక్ట్ అప్రైజల్ కమ్ కన్వర్జెన్స్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ్ యోజన (గ్రావీ-సాజీయ్) పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ప్రాధాన్యతగా పూర్తి చేయాలన్నారు. ఫేస్ 2 కింద హోళగుంద లోని మార్లమడికి, కర్నూలు లోని నూతనపల్లె, పెద్దకడుబూరు లోని మేకడోన, ఆస్పరి లోని నగరూరు, ఓర్వకల్ లోని ఉప్పలపాడు, మంత్రాలయం లోని బుదురు, గుడిపాడు, గూడూరు లోని కురువనాగలాపురం, నందవరం లోని మాచపురం గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. పీఎం-అజయ్ పథకం కింద తాగునీటి సౌకర్యాలకు సంబంధించిన పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను చేపట్టాలని, ముఖ్యంగా తాగునీటి సమస్యల పరిష్కారానికే అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.. అందుబాటులో ఉన్న నిధులను తాగునీటి సరఫరా, పైప్‌లైన్‌లు, ఇతర తాగునీటి మౌలిక వసతుల కల్పనకు వినియోగించే అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. నిధులు అందుబాటులో ఉన్న మేరకు తదుపరి ప్రాధాన్యతగా డ్రైనేజీ పనులు చేపట్టాలన్నారు. మంజూరైన నిధులను వేగంగా వినియోగించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, 100 శాతం నిధులు ఖర్చు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా శాఖల మధ్య సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) శాఖ అధికారులు వెంటనే పనుల పురోగతిని వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న వ్యయాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, ఇంచార్జి జిల్లా పరిషత్ సీఈఓ సుబ్బారెడ్డి, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారిని రాధిక, డి ఎమ్ హెచ్ ఓ డా.భాస్కర్ రాజు, ఐసిడిఎస్ పిడి విజయ, డి పి ఓ భాస్కర్, ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర బ్రాహ్మణ మహిళ కార్యదర్శి గా చెన్నమరాజ వసుంధర దేవి



**నంద్యాల సిటీ బ్యూరో జులై 10 ( నంది పత్రిక )** ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య మహిళ విభాగం రాష్ట్ర కార్యదర్శి గా నంద్యాల పట్టణం కు చెందిన చెన్నమరాజ వసుంధర దేవి నీ నియామకం చేసి నియామక పత్రం ను ప్రధాన కార్యదర్శి హెచ్ కే మనోహర రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నంద్యాల జిల్లా లో బ్రాహ్మణ జాతి అభివృద్ధి కీ ఐకమత్యం కు హక్కుల సాధన కు కృషి చేస్తున్న వసుంధర దేవి కి రాష్ట్ర స్థాయి లో గుర్తింపు రావడం హర్షించదగ్గ విషయం అని బ్రాహ్మణ సంఘం నాయకులు తెలిపారు. తన సేవలు గుర్తించి రాష్ట్ర కార్యదర్శి గా మరిన్ని బాధ్యతలు ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షులు కోనూరు సతీష్ శర్మ , ప్రధాన కార్యదర్శి హెచ్ కే మనోహర రావు కు, తనను ప్రోత్సహించిన నంద్యాల బ్రాహ్మణ సంఘం కు వసుంధర దేవి కృతజ్ఞతలు ధన్యవాదములు చేశారు.

# రావణ్ కస్టడీ పిటిషన్ విచారణ ఈ నెల 14కి వాయిదా

### గన్నవరం కోర్టులో రావణ్ తరఫున వైకాపా లీగల్ సెల్ హాజరు



సోషల్ మీడియా కామెంట్ల కేసులో అరెస్టు అయిన రావణ్ కస్టడీ పిటిషన్ పై విచారణను గన్నవరం కోర్టు ఈ నెల 14వ తేదీకి వాయిదా వేసింది. రావణ్ ను 7 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై శుక్రవారం గన్నవరం కోర్టులో విచారణ జరిగింది. విచారణ సందర్భంగా రావణ్ తరఫున వైకాపా లీగల్ సెల్ ప్రతినిధులు పొన్నవోలు సుధాకర్, ఓ.గవాస్కర్, తిరువీధి వెంకయ్య కోర్టుకు హాజరయ్యారు. అయితే ప్రాసిక్యూషన్ తరఫున న్యాయవాదులు కోర్టుకు హాజరుకాకపోవడంతో న్యాయాధికారి పిటిషన్ విచారణను ఈ నెల 14వ తేదీకి వాయిదా వేశారు.

# ఎస్ఐఆర్ ప్రత్యేక శిబిరాలకు ఓటర్లు కదిలిరావాలి







## ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలి

### శని, ఆదివారాల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు

### కర్నూలు అసెంబ్లీ ఈఆర్వో, కమిషనర్ చల్లా ఓబులేసు

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తి చేసుకొని ఓటర్లు, శని, ఆదివారాల్లో నిర్వహించే ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్వో), నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం 194, 196, 197 పోలింగ్ కేంద్రాల పరిధిలోని కింగ్ మార్కెట్, ఫ్రూట్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఎస్ఐఆర్ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. హ్యాండ్‌మైక్ ద్వారా ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై చైతన్యపరిచారు. ఈ సందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ఓటరు జాబితా శుద్ధీకరణకు ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ ప్రక్రియ పట్ల ఎవరూ అలసత్వం ప్రదర్శించరాదని సూచించారు. ప్రస్తుతం అందజేసే వివరాలు భవిష్యత్తులో ఓటరు జాబితా నిర్వహణతో పాటు భావి తరాలకు భవిష్యత్తులో నిర్వహించే ఇదే ప్రక్రియకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఎన్యూమరేషన్ ఫారం అందకపోయినా, అందుకున్నప్పటికీ బీఎల్‌ఓకు సమర్పించని ఓటర్లు ప్రత్యేక శిబిరాలకు వెళ్లి, ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని సూచించారు.

శని, ఆదివారాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక శిబిరాలు కొనసాగుతాయని చెప్పారు. ఓటర్లు 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎక్కడ ఓటు వేశారో అదే పోలింగ్ కేంద్రానికి వెళ్లాలని సూచించారు. వెళ్లేటప్పుడు ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, అలాగే 2002 సంవత్సరం ఓటరు జాబితాలో తమ లేదా తమ పూర్వికుల వివరాలు అందుబాటులో ఉంటే వాటితో వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్వో, కార్యదర్శి నాగరాజు, సూపర్వైజర్లు భార్గవ్, వేణుప్రియ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో మరణించిన ఎ.ఎస్.ఐ, కానిస్టేబుల్ కుటుంబాలకు రూ.2.5 లక్షల ఆర్థిక సాయం అందచేసిన జిల్లా ఎస్.పి శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపిఎస్ గారు

### కుటుంబ యోగ క్షేమాలు విచారించిన జిల్లా ఎస్.పి గారు... అండగా ఉంటామని భరోసా.



**కడప జులై 10:** కడప పోలీస్ కంట్రోల్ రూమ్ లో విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యం తో మరణించిన ఏ.ఎస్.ఐ ఎస్.రత్నరాజు మరియు కలమల్ల పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ మరణించిన కానిస్టేబుల్ బాలవాసు కుటుంబాలకు (గ్రజ 932) కుటుంబాలకు జిల్లా ఎస్.పి శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ గారు రూ.2.5 లక్షల ఆర్థిక సాయాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం అందచేశారు. పోలీస్ సంక్షేమంలో భాగంగా పోలీసు వితరణ నిధి నుండి ఈ మొత్తాన్ని అందచేశారు. ఏ.ఎస్.ఐ సతీమణి ప్రిస్కిల్లా కు, బాల వాసు తండ్రి బాల గంగన్న కు జిల్లా ఎస్.పి గారు ఆర్థిక సాయం చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి గారు దివంగత ఏ.ఎస్.ఐ, కానిస్టేబుల్ కుటుంబ యోగక్షేమాలు విచారించారు. అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, డి.పి.ఓ సూపరింటెండెంట్. పి.సురేష్, క్లర్క్ డి.రమేష్ పాల్గొన్నారు.

# 'పార్కుల స్థలాల జోలికి వస్తే కఠిన చర్యలు'






## ఆక్రమణదారులకు కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరిక

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** కర్నూలు నగరపాలక సంస్థకు చెందిన పార్కుల స్థలాల జోలికి వస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు సైతం నమోదు చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆక్రమణదారులను హెచ్చరించారు. శుక్రవారం ఆయన వీకర్ సెక్షన్ కాలనీ సమీపంలోని ఎల్.పీ. నెం. 69/87లోని పార్కు స్థలాన్ని పరిశీలించారు. స్థలాన్ని అన్యాక్రాంతం చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్లు కమిషనర్ దృష్టికి రావడంతో, సదరు స్థలం వద్ద వెంటనే హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో పట్టణ ప్రణాళిక అధికారులు బోర్డును ఏర్పాటు చేశారు. అదేవిధంగా పార్కు స్థలానికి వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వీకర్ సెక్షన్ కాలనీ సమీపంలోని ఎల్.పీ. నెం. 69/87లో సుమారు 40 సెంట్ల పార్కు స్థలంలో గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా రాళ్లు పాతినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. గతంలో వాటిని తొలగించినప్పటికీ, ఇటీవల మళ్లీ కొందరు రాళ్లు పాతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరైనా పార్కులను అన్యాక్రాంతం చేయాలని చూస్తే ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని, ఎవరైనా, ఎంతటివారైనా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా పార్కు స్థలాలను కబ్జా చేయాలని చేస్తుంటే స్థానికులు సైతం అడ్డుకోవాలని, నగరపాలక అధికారులకు సమాచారం ఇవ్వాలని కమిషనర్ సూచించారు.

## అయ్యప్పస్వామికి పబ్లిసిటీ అవసరం లేదు: దేవస్వం బోర్డు

శబరిమల వార్షిక యాత్రను పురస్కరించుకుని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టీడీబీ) కీలక సంస్కరణలను ప్రకటించింది. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, యాత్రా నిర్వహణను ఆధునికీకరించడమే లక్ష్యంగా ఈ మార్పులు చేపట్టినట్లు వెల్లడించింది. ఇందులో భాగంగా గతంలో వివాదాస్పదంగా మారిన 'అయ్యప్ప సంగమం' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేసింది. 'అయ్యప్ప స్వామికి ఎలాంటి ప్రచారం అవసరం లేదు' అని బోర్డు అధ్యక్షుడు కె. జయకుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. నవంబర్ మధ్యలో ప్రారంభమయ్యే రెండు నెలల యాత్ర సీజన్‌కు ముందే ఈ నిర్ణయాలు వెలువడ్డాయి. నూతన సంస్కరణల ప్రకారం భక్తులకు అందించే సేవలను పూర్తిగా డిజిటలైజ్ చేయనున్నారు. రద్దీని పర్యవేక్షించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత వ్యవస్థలను ఏర్పాటు

# కుంకునూరు నాగరాణి సేవలు మరువలేనివి

### మాల మహానాడు నాయకులు కల్లపోతుల నరసింహులు, రంగన్న



**నంది పత్రిక ఆదోని ప్రతినిధి** ఆదోని పట్టణంలోని అంబేద్కర్ నగర్ కు చెందిన కుంకునూరు వీరేష్ భార్య స్వర్గీయ కుంకునూర్ నాగరాణి సేవలో మరువలేనివని మాల మహానాడు నాయకులు కల్లపోతుల నరసింహులు మరియు కల్లపోతుల రంగన్న లు అన్నారు. శుక్రవారం ఆమె సంతాప సభను కుంకునురు వీరేశ్ ఆధ్వర్యంలో స్థానిక జీవనజ్యోతి ఆశ్రమంలో నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి మాల మహానాడు నాయకులు రంగన్న,నరసింహులు, కుంకునూరు వీరేష్, కుంకునూరు నవీన్ ప్రశాంత్ లు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె జ్ఞాపకార్థం రూ 11 వేల రూపాయలతో ఆశ్రమానికి మెడికల్ మంచాన్ని బహుమతిగా ఇచ్చారు. ఈ సందర్భంగా రంగన్న, నరసింహులు మాట్లాడుతూ రంగన్న, వీరేష్ లు మాట్లాడుతూ నాగరాణి చేసినా సేవలపై వారు ప్రశంసించారు. ఆమె అంగన్వాడీ వర్కర్ల సమస్యల కోసం అనేక పోరాటాలు చేసిందని, అదేవిధంగా విద్యా కమిటీ చైర్మన్ గా ఉన్నప్పుడు ఆమె సొంత నిధులతో పాఠశాల రూపు రేఖలే మార్చిందని గుర్తు చేశారు. స్లమ్ డెవలప్మెంట్ చైర్మన్గా ఉన్నప్పుడు అంబేద్కర్ నగర్లో దాదాపు 200 పైగా మరుగుదొడ్లు నిర్మాణానికి కృషి చేసిందని తెలిపారు. అదేవిధంగా అంగన్వాడి కార్యకర్తగా ఆమె అనేక సేవలందించిన విషయాన్ని వారు గుర్తు చేశారు.. అనంతరం అనాధాశ్రమంలో అనాధలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోదండ రాము, బుల్లెట్ ఈరన్న, రామాంజనేయులు, జీవనజ్యోతి ఆశ్రమం నిర్వాహకులు ఫిలిప్స్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** కర్నూలు నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. శుక్రవారం ఆయన బళ్లారి చౌరస్తా ఆంజనేయస్వామి ఆలయం వెనుక నిర్మిస్తున్న నూతన రహదారి, వై. జంక్షన్ కూడలి అభివృద్ధి పనులను పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. బళ్లారి చౌరస్తా వద్ద ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ఆంజనేయస్వామి ఆలయం వెనుక రూ.1.45 కోట్లతో 120 మీటర్ల మేర నూతన రహదారి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని, ఈ నెలాఖరులోగా వాటిని పూర్తి చేయనున్నట్లు తెలిపారు. అలాగే రూ.54 లక్షల ఎన్‌క్యాప్ నిధులతో వై.జంక్షన్ కూడలిని అభివృద్ధి చేస్తున్నామని, మరో రెండు నెలల్లో పనులు పూర్తవుతాయని చెప్పారు. అంతకన్నాముందు శ్రీనగర్ కాలనీ, మాధవి నగర్, నంద్యాల చెక్‌పోస్ట్, వై.జంక్షన్, వీకర్ సెక్షన్ కాలనీ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పరిమళ నగర్ అన్న క్యాంటీన్‌ను అకస్మిక తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో టీఏఈ ఖాసిం వలి, సానిటరీ ఇంస్పెక్టర్‌లు హుస్సేన్, ఆలీం బాష, కాంట్రాక్టర్ మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కొరమేనుగుంటలో డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం:

### తుడా చైర్మన్ డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి

**తుడా నిధులతో నూతన మురుగునీటి కాల్వల నిర్మాణానికి ఘనంగా భూమి పూజ**

**సకాలంలో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశం.**



**తిరుపతి బ్యూరో చీఫ్ జూలై 10 నంది పత్రిక** తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని కొరమేనుగుంటలో డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కరిస్తున్నామని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి తెలిపారు. సుమారు 49.5 లక్షల రూపాయల తిరుపతి నగరాభివృద్ధి సంస్థ నిధులతో నిర్మించతలపెట్టిన నూతన మురుగునీటి కాల్వల (డ్రైనేజీ) నిర్మాణ పనులకు తుడా చైర్మన్, టిటిడి ఎక్స్ అఫిషియో మెంబర్ డాలర్స్ దివాకర్ రెడ్డి, టిటిడి బోర్డు మెంబెర్ పనబాక లక్ష్మి, గ్రీనరీ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, తిరుపతి నగరపాలకక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి శారద, తుడా యస్ఈ రవీంద్రయ్య ప్రజా ప్రతినిధులు శుక్రవారం ఉదయం కలసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పాలనలో కొరమేనుగుంట ప్రాంత అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యంతో వదిలేశారని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక స్థానిక ప్రజలు, ఇళ్లలో మురుగునీరు చేరి తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. కొరమేనుగుంట పరిసర ప్రాంతాల్లో మురుగునీరు సరిగ్గా ప్రవహించక, వర్ష కాలంలో స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులు మా దృష్టికి వచ్చాయని తెలిపారు. ప్రజల ఆరోగ్య భద్రత, నగర సుందరీకరణే ధ్యేయంగా తుడా నిధులను కేటాయించి ఈ నూతన మురుగునీటి కాల్వల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. గతంలో తుడాను కేవలం ఒకే ఒక్క నియోజకవర్గానికి పరిమితం చేసి రాజకీయం చేశారని, మా కూటమి ప్రభుత్వంలో తుడా పరిధిలోకి వచ్చే తొమ్మిది నియోజకవర్గాలను సమానంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని, కొరమేనుగుంటతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా నూతన కాల్వలు, రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, త్వరలోనే ఆ పనులు కూడా ప్రారంభిస్తామని తెలిపారు. నిర్మాణ పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకూడదని అధికారులను ఆదేశించారు. తాము వినతి చేసిన వెంటనే ఆయన స్పందించి, కేవలం 2 నెలల లోపే నిధులు మంజూరు చేసి, టెండర్లు పిలిచి, ఈరోజు భూమి పూజ చేయడం మాకెంతో ఆనందాన్ని ఇచ్చిందని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తుడా,మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.



# పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేయాలి

### పెండింగ్ భూ సమస్యల పనులను వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఏపిఐఐసి జోనల్ మేనేజర్ ను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లో డ్రోన్ సిటీ పురోగతి, ఎన్ఐసిడిసి, ఓఎంఐహెచ్, ఎమ్ఎస్ఎమ్ఈ వివిధ పరిశ్రమ పనుల పురోగతి అంశం పై కలెక్టర్ సంబంధిత పరిశ్రమల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా



కలెక్టర్ మాట్లాడుతూ డ్రోన్ సిటీ కి అవసరమైన రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రస్తుతం రోడ్లు, డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయని, విద్యుత్ సరఫరాకు అవసరమైన ఏర్పాటుకు నిధులు చెల్లించామని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని అధికారులు కలెక్టర్ కి వివరించారు. ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్ కు సంబంధించి పెండింగ్ భూ సమస్యల పనులను వేగవంతం చేసి అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏపిఐఐసి అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ పరిధిలో మొత్తం ఎనిమిది పనుల్లో ఏడు పనులు పూర్తయ్యాయని, ఒక పని మాత్రమే పెండింగ్‌లో ఉందని అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశంలో ఏపిఐఐసి జోనల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, పరిశ్రమల శాఖ అధికారి సంజీవ రాజు, ఏపిఐఐసి అధికారి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులకు విద్యా ఆవశ్యకతపై అవగాహన కల్పించాలి





- **విద్యార్థుల సంఖ్యను పెంచాలి**
- **డ్రాపౌట్ లేకుండా చూడాలి**
- **మెనూ ప్రకారం భోజనం అందించాలి**
- **గిరిజనులకు ఆధార్,రేషన్, గృహాల సమస్యలు లేకుండాచూడాలి**
- **శివపురం ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా పరిషత్ చైర్మన్ ...... ఎర్రబోతుల పాపి రెడ్డి**

**కొత్తపల్లి – నంది పత్రిక :** మండలంలోని గిరిజన గూడేలలో నివసిస్తున్న పిల్లల తల్లిదండ్రులకు విద్యా ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి గిరిజనులలో విద్యాభివృద్ధికి తోడ్పాటు నివ్వాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని శివపురం గూడెం లోని గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన కొత్తపల్లి జెడ్పిటిసి సోమల సుధాకర్ రెడ్డి తో కలసి సందర్శించారు. ముందుగా తరగతి గదులను, విద్యార్థులు కల్పించే వసతులను, పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయుల కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా ఆశ్రమ పాఠశాల వసతి గృహంలోని విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా గిరిజనులకు ఆధార్, రేషన్ కార్డులు, గృహాల సమస్యలు లేకుండా చూడాలని డిప్యూటీ ఎంపీడీవో కెపిఆర్ శర్మకు సూచించారు. అనంతరం సరస్వతి క్షేత్రమైన కొలనుభారతి ఆలయాన్ని చేరుకొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి, సప్త శివాలయాలను దర్శించుకున్నారు. తర్వాత సప్త నది సంఘమ ప్రాంతంలోని ప్రాచీన సంగమేశ్వరాలయంలో వేపదారు శివలింగానికి కృష్ణా జలాలతో అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, మంగళ హారతి వంటి ప్రత్యేక పూజలు చేసుకున్నారు. సిద్దేశ్వరం సమీపంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలుపుతూ కృష్ణా నదిపై నిర్మించబోతున్న ఐకానిక్ వంతెన ప్రదేశాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో డ్రాప్ అవుట్ సమస్య లేకుండా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. గిరిజన విద్యార్థులు గిరిజనులు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు విద్య ఎంతో దోహదపడుతుందని, విద్య ద్వారా ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులే అవగాహన కల్పించాలన్నారు. మండలంలో గిరిజన గూడెలు ఎక్కువగా ఉన్నాయని ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యా తక్కువగా ఉండటం శోచనీయమన్నడు. ఎంత వీలైతే అంత ఎక్కువ సంఖ్యలో గిరిజన పిల్లలు పాఠశాలలో చేరేందుకు ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. పదవ తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. వసతి గృహంలో నేను బోర్డుపై ఉన్న ప్రతి దానిని తూచా తప్పకుండా విద్యార్థులకు అందించాలన్నారు. ఎంతోమంది గిరిజనులకు ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు లేక ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారన్నారు.

సరైన గృహాలు లేక ఉండేందుకు పూరి గుడిసెలలోని జీవనం సాగిస్తున్నారన్నారు. కొన్ని గిరిజన గూడెంలలో గృహ నిర్మాణాలు మధ్యలో నిలిచిపోవడం, కొన్ని స్లాబు వేసి నిలిచిపోవడం వంటి సమస్యలు ఉన్నాయని వాటన్నింటినీ అధికారులు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అదేవిధంగా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. వీరి వెంట ఎంఈఓ నాగరాజు, ఆయా మండలాల జడ్పీటీసీలు శివ శంకర్ రెడ్డి, పుల్యాల దివ్య, రంగనాథ గౌడ్, యుగంధర్ రెడ్డి, ధోరణిపాడు శకుంతలమ్మ, తదితరులు ఉన్నారు





# గడువు లోపు ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి.

### 167- నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి శారదా దేవి.



**తిరుపతి బ్యూరో చీఫ్ జూలై 10 నంది పత్రిక** ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువు లోపు నగరంలో ప్రత్యేక ఓటర్ల జాబితా ప్రక్రియను పూర్తి చేయాలని 167- తిరుపతి నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని పరసాల వీధి, మర్రి చెన్నారెడ్డి కాలనీ, తదితర ప్రాంతాల్లో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ విధానాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వారీగా ఇచ్చిన అన్ని ఎన్యుమరేషన్ పారాల్లో పొరపాట్లు లేకుండా స్వయంగా పరిశీలించి స్వీకరించాలని తెలిపారు. ఈ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ యొక్క ప్రాధాన్యత ను వివరించాలని తెలిపారు. సీనియర్ సిటిజన్లు (వృద్ధులు) స్వయంగా వచ్చి తమ ఎన్యుమరేషన్ పారాలను ఇస్తున్నారని తెలిపారు. యువత చురుగ్గా పాల్గొని తమ ఓట్లను నమోదు చేసుకోవాలని, మీ ఇంటికి ఇచ్చిన ఎన్యుమరేషన్ పారాలను బూత్ లెవెల్ ఆఫీసర్ కు అందజేయాలని తెలిపారు. ఈ 14 వ తేదీ గడువు ముగుస్తుందని ఈ లోపు అందరూ స్పందించి ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజల అనుమానాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేకంగా స్వర్ణవార్డు సచివాలయాల్లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఏఈఆర్వో లు మూర్తి, రఫీ, సూపర్ వైజర్లు, బూత్ లెవెల్ ఆఫీసర్లు, తదితరులు ఉన్నారు.



# టీడీపీ ఎన్నారై జాతీయ కమిటీని నియమించిన చంద్రబాబు..

తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తమ ఎన్ఆర్ఐ విభాగాన్ని బలోపేతం చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు, టీడీపీ ఎన్ఆర్ఐ జాతీయ కమిటీని నియమించినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు శుక్రవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. విదేశాల్లో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేయడంతో పాటు, ప్రవాసాంధ్రులను పార్టీకి మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఈ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. 44 మంది సభ్యులతో కూడిన ఈ భారీ కమిటీకి నూతన అధ్యక్షుడిగా పి. గురురాజాను నియమించారు. పార్టీలో కీలకమైన ప్రధాన కార్యదర్శుల బాధ్యతలను ముగ్గురికి అప్పగించారు. జి. గంగాధర్, ముక్కు తులసి కుమార్, చలసాని కిశోర్ ప్రధాన కార్యదర్శులుగా వ్యవహరించనున్నారు. వీరితో పాటు ఐదుగురిని ఉపాధ్యక్షులుగా నియమించారు. వారిలో ఇంద్రసేన నాయుడు మద్దిబాట్ల, కోమటి జయరాం, రషీదా బేగం, సురేష్ పుట్టగుంట, శ్యామ్ కొడూరి ఉన్నారు.

కమిటీలోని ఇతర సభ్యులు, వారి పదవుల పూర్తి వివరాలు ఈ విధంగా ఉన్నాయి:ఆర్గనైజింగ్ సెక్రటరీలు: విజేత జవ్వాది, బాలసుబ్రహ్మణ్యం అన్నమేటి, విజయ్ అడుసుమిల్లి, శివ నాగరాజు నక్కల, కౌతారపు లావణ్య, మాధవి ముప్పవరపు, రాజా రవికిరణ్ కోడి, సైఫుల్లా ఖలీద్, రాచూరి మోహన్, అల్లా వెంకట్, చావా పద్మ, వేణుగోపాల్ రెడ్డి, యష్ బొద్దులూరి, హేమ కోసూరు, విజయ్ చెన్నుపాటి.

కార్యదర్శులు: శ్రీనివాస్ గోగినేని, రాజేష్ పల్లేటి, నాగరాజు జడ, పింకీ పొనుగోటి, పేరూరు రామకృష్ణ, గాలి దుర్గాభవాని, వంకా వెంకటరమణమ్మ, కృష్ణ ప్రియ అడుసుమిల్లి, సూర్య బెజవాడ, తరణిధర్ పరుచూరి, సుభాష్ రావడ, జోగి నాయుడు, వెంకట రమణ, గోపి నంబళ్ల, కవిత పరుచూరి, అనిల్ కుమార్ నున్నా,నర్మద జొన్నగడ్డ. ఇతర ముఖ్య బాధ్యతలు: సోషల్ మీడియా విభాగం బాధ్యతలను స్వాతి రెడ్డి, సాయి బొల్లినేనికి అప్పగించారు. కమిటీ కోశాధికారి (ట్రెజరర్)గా శ్రీనివాస్ అబ్బూరిని నియమించారు. ఈ నూతన కమిటీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగుదేశం పార్టీ మద్దతుదారులను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తుందని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం

**రావుస్ కళాశాలలో బాలికలకు వక్తృత్వ పోటీల నిర్వహణ లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు రావుస్ కళాశాలల చైర్మన్ అప్పారావు, డైరెక్టర్ మౌని చంద్ర సౌజన్యంతో నిర్వహణ**

**నంద్యాల సిటీ బ్యూరో జులై 10 ( నంది పత్రిక )** నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని,శుక్రవారం బాలాజీ కాంప్లెక్స్ లో ఉన్న రావుస్ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్ అధ్యక్షతన,కార్యదర్శి మేడా చంద్రశేఖర్ నిర్వహణలో,రావుస్ కళాశాలల చైర్మన్ అప్పారావు, డైరెక్టర్ మౌని చంద్ర సౌజన్యంతో జరిగిన ఒక కార్యక్రమంలో లయన్స్ జిల్లా వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సందీప్ మాట్లాడుతూ "యువత ఆశలు,ఆశయాలు నేడు, భవిష్యత్తులో నెరవేరాలని" ఈ సంవత్సరం ప్రపంచ జనాభా దినోత్సవ నినాదమని తెలిపారు.

డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ప్రపంచ జనాభా నిరంతరం పెరుగుతున్నదని, భూమి స్థిరంగా ఉంటుందని,వనరులు అందరికీ అందుబాటులోకి తేవడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కర్తవ్యం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. అదే సమయంలో అధిక జనాభాని మానవ వనరులుగా అన్ని రంగాలలో వినియోగించుకుని దేశాన్ని ముందుకు తీసుకుపోవాల్సిన ఆవశ్యకత నేడు ఉందని అన్నారు. ఈ సందర్భంగా "అధిక జనాభా అనర్థదాయకమా, ప్రయోజనకరమా" అన్న అంశంపై జరిగిన వక్తృత్వ పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో



లయన్స్ క్లబ్ కార్యదర్శి మేడా చంద్రశేఖర్, కోశాధికారి సురేష్,రావుస్ కళాశాలల ప్రిన్సిపల్స్ గా ఉన్న సుంకయ్య, సంగమేష్, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ నిజాముద్దీన్,జోన్ చైర్మన్ సోమేశుల నాగరాజు, సభ్యులు కన్నయ్య,రత్నకుమార్, ఆరవేటి రఘు,పాలూరి ప్రశాంత్, పోలూరు జనార్ధన్, కిరణ్ లాల్, కళాశాల బాలికలు పాల్గొన్నారు.

**వక్తృత్వ పోటీ విజేతలు:** కలిమా,ఆస్మా తబసుం, సింధు వరుసగా ప్రథమ,ద్వితీయ,తృతీయ స్థానాలు సాధించగా అక్షయ దేవి,వైష్ణవి,హాఫీజ ప్రోత్సాహక బహుమతులు సాధించారు.

# ఆత్మకూరును క్రీడా పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం: స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా



**వెలుగోడు, జూలై 10 (నంది పత్రిక):** ఆత్మకూరు పట్టణాన్ని క్రీడా పట్టణంగా అభివృద్ధి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా తెలిపారు. ఈ నెల 11, 12 తేదీలలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించే యూత్ అండ్ స్పోర్ట్స్ ప్రమోషన్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛాంపియన్‌షిప్2026 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు ఆత్మకూరు స్టేడియం నుంచి క్రీడాకారులను పంపిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి సహకారంతో ఆత్మకూరు ఎన్‌టీఆర్ కేవీకే స్టేడియంలో ఎనిమిది రకాల క్రీడల్లో యువతకు శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించే ఉద్యోగ నియామకాలలో క్రీడాకారులకు లభించే రిజర్వేషన్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలంటే ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో రాణించి జాతీయ స్థాయికి ఎంపికై, గోవాలో జరిగే జాతీయస్థాయి అసోసియేషన్ మీట్‌లో పాల్గొనే అవకాశం క్రీడాకారులకు దక్కాలని ఆకాంక్షించారు. ఆత్మకూరు జట్టు తరఫున కబడ్డీ కోచ్‌గా శిక్షకుడు సతీష్‌ను నియమించినట్లు తెలిపారు. త్వరలో ఎమ్మెల్యే అనుమతితో ఆత్మకూరులోని ఎన్‌టీఆర్ కేవీకే స్టేడియంలో దక్షిణ భారత జాతీయస్థాయి ఆల్ స్పోర్ట్స్ పోటీల నిర్వహణకు చర్యలు చేపడతామని వెల్లడించారు. ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ క్లబ్ కార్యదర్శి ఆసిఫ్, అబ్దుల్ జబ్బార్, రేణుకా ప్రసాద్, ఖోఖో శిక్షకులు మహబూబ్, సయ్యద్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

# నవ్య ఆవిష్కరణల కేంద్రంగా కడప జిల్లా..!!







**'తేజస్ వర్క్‌షాప్2026'లో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పిలుపు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా... ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై యువతకు మార్గనిర్దేశం**

**కడప, బ్యూరో చీఫ్ జూలై 10 నంది పత్రిక:** ప్రభుత్వం అందిస్తున్న స్టార్టప్ విధానాలు, ఆర్థిక ప్రోత్సాహకాలు, సాంకేతిక సహకారాన్ని సద్వినియోగం చేసుకుని కడప జిల్లాను నవ్య ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి యువతకు పిలుపునిచ్చారు. శుక్రవారం కడప కలెక్టరేట్‌లోని సభా భవన్‌లో నిర్వహించిన 'తేజస్ వర్క్‌షాప్2026' కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన అధ్యక్షతన జరిగిన ఈ వర్క్‌షాప్‌లో రాయలసీమ సాంకేతిక ఆవిష్కరణ కేంద్రం (ఆర్టీఐహెచ్), తిరుపతి ముఖ్య కార్యనిర్వాహక అధికారి విజయ్ మాథుర్ పాల్గొన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విద్యార్థుల్లో నవ్య ఆవిష్కరణలు, స్టార్టప్‌లపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఆర్టీఐహెచ్, ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణ సంస్థ, డీపీఐఐటీస్టార్టప్ ఇండియా సంయుక్తంగా ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రపంచ స్థాయి ఆవిష్కరణలకు గ్రామీణ ప్రాంతాల నుంచే పునాది పడుతుందని అన్నారు. మంచి ఆలోచన, పట్టుదల, సరైన మార్గనిర్దేశం ఉంటే యువత ప్రపంచ మార్కెట్లలో పోటీ పడగలరని చెప్పారు. కడప జిల్లాలో వ్యవసాయం, ఉద్యానవనం, ఖనిజ సంపద, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధనం, సమాచార సాంకేతిక రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని, వాటిని ఆధారంగా చేసుకుని వినూత్న సంస్థలను స్థాపించాలని సూచించారు.

ప్రభుత్వం స్టార్టప్‌లకు నమోదు, మెంటరింగ్, ఇంక్యుబేషన్, నిధుల సమీకరణ, వ్యాపార విస్తరణ, మార్కెట్ అనుసంధానం వంటి అనేక రంగాల్లో సమగ్ర సహకారం అందిస్తోందని చెప్పారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని యువత స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా తమ సృజనాత్మక ఆలోచనలను వ్యాపార అవకాశాలుగా మలుచుకుని పదిమందికి ఉపాధి కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. రాయలసీమ సాంకేతిక ఆవిష్కరణ కేంద్రం (ఆర్టీఐహెచ్), తిరుపతి ముఖ్య కార్యనిర్వాహక అధికారి విజయ్ మాథుర్ మాట్లాడుతూ... ఒక మంచి ఆలోచనను విజయవంతమైన సంస్థగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ఇంక్యుబేషన్, సాంకేతిక మార్గనిర్దేశం, మెంటరింగ్, నమూనా అభివృద్ధి వంటి సేవలను సంస్థ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. రాయలసీమ యువతలో ఉన్న ప్రతిభను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమన్నారు. భారత పరిశ్రమలువాణిజ్య సమాఖ్య ప్రతినిధి రిషి దేవన్ వర్చువల్‌గా పాల్గొని, యువత ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని, స్టార్టప్‌ల ద్వారా దేశ ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సందేశమిచ్చారు. వర్క్‌షాప్‌లో స్టార్టప్ ఇండియా పథకాల పరిచయం, నమోదు విధానం, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, వ్యాపార నమూనాల రూపకల్పన, మార్కెట్ విశ్లేషణ, సమస్యల గుర్తింపుపరిష్కార ఆలోచన, నిధుల సమీకరణ, పెట్టుబడిదారులను ఆకర్షించే విధానాలు, స్టార్టప్ ప్రతిపాదనల సమర్పణ వంటి అంశాలపై నిపుణులు విస్తృతంగా అవగాహన కల్పించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం ప్రధాన నిర్వాహకుడు చాంద్ బాషా మాట్లాడుతూ.. జిల్లాలోని పారిశ్రామిక అవకాశాలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పథకాలు, రుణ సదుపాయాలపై వివరించారు. రోబోమాంక్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు ఆర్. వికాస్ రెడ్డి తన విజయ ప్రయాణాన్ని వివరిస్తూ,

చిన్న పట్టణాల నుంచే అంతర్జాతీయ స్థాయి సంస్థలను నిర్మించవచ్చని యువతలో ఆత్మవిశ్వాసం నింపారు. ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణ సంస్థ ప్రతినిధులు రాష్ట్ర స్టార్టప్‌ఆవిష్కరణ విధానం (20242029) కింద లభించే రాయితీలు, గ్రాంట్లు, ప్రత్యేక ప్రోత్సాహకాలను వివరించారు. అనంతరం నిర్వహించిన స్టార్టప్ ఆలోచనల సవాల్ కార్యక్రమంలో యువత బృందాలుగా పాల్గొని వినూత్న వ్యాపార ఆలోచనలను రూపొందించారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యాసంస్థల విద్యార్థులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్టార్టప్ వ్యవస్థాపకులు, మెంటర్లు, పరిశ్రమల శాఖ అధికారులు, జిల్లా పరిపాలన ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# మేధా విద్యా సంస్థలు ఆర్.ఇ.యస్ కాలేజ్, మైదుకూరు నందు "పోలీస్ కళా-జాగృతి బృందం" నాటక ప్రదర్శన



**కడప జులై 10:** జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ వారి ఆదేశాల మేరకు శుక్రవారం మధ్యాహ్నం మేధా విద్యా సంస్థలు ఆర్.ఇ.యస్ కాలేజ్, మైదుకూరు నందు "పోలీస్ కళా-జాగృతి బృందం" ఇన్‌చార్జ్ జి.నరసరామ్ మరియు టీమ్ చే 'ఓయువతా... మేలుకో" నాటక, పాటల ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మైదుకూరు యస్.ఐ వెంకటరమణ మాట్లాడుతూ నేటిసమాజంలో యువత "డ్రగ్స్"కు దూరంగా ఉండి వారి భవిష్యత్తును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మత్తుపదార్థాలు వాడిన, అమ్మిన, ఆశ్రయం కల్పించిన దానికి తగిన శిక్షలు గురించి తెలియజేశారు. మత్తు పదార్థాల ఆచూకీ తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972కి కాల్ చేసి తెలియజేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్స్ రాజారెడ్డి, ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ మత్తుపదార్థాల వాడకంవల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు, సమాజంలోని రుగ్మతలు వాటివలన కలిగే అనర్థాల గురించి వివరించారు. అలాగే తల్లిదండ్రులు పిల్లలు విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. మైదుకూరు ఏ.యస్.ఐ శివప్రసాద్ రెడ్డి విద్యార్థులచే "యువతా మేలుకో-మత్తు నుండి తేరుకో, డ్రగ్స్ వద్దు- జీవితం ముద్దు, మత్తుపదార్థాలకు దూరంగా ఉందాం- భవిష్యత్తును కాపాడుకుందాం" అని నినాదాలు చేయించారు.

**"పోలీసు కళా-జాగృతి బృందం" ప్రదర్శన విద్యార్థులను అలరించింది.** ఈకార్యక్రమంలో బృందసభ్యులు, కాలేజ్ అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ సీతారాముల దేవాలయం - ప్రతిష్ఠా మహోత్సవం.

**ఖాజీపేట నంది పత్రిక ప్రతినిధి జూలై 10** వైస్సార్ కడప జిల్లా ఖాజీపేట మండలంలో కె.బుడ్డాయపల్లి గ్రామం, నూతనంగా నిర్మించిన శ్రీ సీతారాముల ఆలయంలో ధ్వజస్తంభం మరియు శ్రీ గంగమ్మ తల్లి పోతురాజు స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతున్న సదర్భంగా ఈ రోజు విగ్రహప్రతిష్ఠ వేడుకల లో పాల్గొన్న వైఎస్ఆర్సీపీ నాయకులు జిల్లా జనరల్ సెక్రటరీ పీవీ రాఘవ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు దుగ్గిరెడ్డి మురళి మోహన్ రెడ్డి వైస్సార్సీపీ రాష్ట్ర ఐటీ వింగ్ కార్యదర్శి పాలకొలను లక్ష్మీనారాయణ రెడ్డి, కేసి కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మెన్ డి యల్ శ్రీనివాసులరెడ్డి, రైతు విభాగము జిల్లా జనరల్ సెక్రటరీ రెడ్యమ్ రామకృష్ణ రెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ డిబి కొండారెడ్డి, యస్సీ విభాగం లక్ష్మయ్య, మాజీ సర్పంచులు మిడుతూరు చంద్ర, తవ్వారు పల్లె అమరేశ్వర్ రెడ్డి, వైఎస్సార్ చమళ్ళపల్లె బుజ్జి, కూనవారిపల్లె భూమన సుబ్బారెడ్డి మండల నాయకులు, పాల శ్రీనివాసుల రెడ్డి,రావులపల్లి ఓబులరెడ్డి, అచ్చన పల్లె రామకృష్ణ రెడ్డి, వీరికిబుడ్డాయపల్లె గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి సన్మంచి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.



# ఖరీఫ్ కాలంలో సాగు చేసిన పంటలకు భీమా చేయించుకోవాలి .

**నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు.**



**నంద్యాల సిటీ బ్యూరో జులై 10 ( నంది పత్రిక )** ఖరీఫ్ కాలంలో సాగుచేసిన పంటలకు భీమా చేయించుకోవాలని నంద్యాల వ్యవసాయ అధికారి ప్రసాద రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఖరీఫ్ కాలంలో సాగు చేసిన పంటలకు ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ భీమా , వాతావరణ ఆధారిత భీమా ను వివిధ పంటలకు వర్తింప చేస్తూ మార్గదర్శకాలు విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ భీమా పథకం లో వరి గ్రామం యూనిట్ గా, మొక్కజొన్న, మినుము, కంది, మిరప మండలం యూనిట్ గా, సజ్జ, కొర్ర, ఉల్లి, ఆముదం, జొన్న జిల్లా యూనిట్ గా ఉన్నదని, వరికి ఎకరాకు 800/-, మొక్కజొన్న కు 660/-, కంది కి 400/- , మినుము మరియు జొన్నకు 190/-, సజ్జ మరియు ఆముదం పంటలకు 160/-, ఉల్లికి 450/- , మిరపకు 2880/- ప్రీమియం చెల్లించి రైతులు పంటల భీమా పథకం లో నమోదు చేసుకోవచ్చునని, అలాగే, వరికి ఆగస్టు 15వ తేదీ వరకు మరియు ఇతర పంటలకు జూలై 31 వరకు గడువు ఉన్నదని తెలిపారు. అలాగే వాతావరణ ఆధారిత భీమా పథకం లో వేరుశనగ, ప్రత్తి మరియు అరటి పంటలు పొందు పరచటం జరిగిందని , వేరుశనగ కు ఎకరాకు 560/-, ప్రత్తి కి 1600/- మరియు అరటికి 2750/- రూపాయలు ప్రీమియం గా చెల్లించి జూలై 15 వ తేదీలోగా రైతులు నమోదు చేసుకోగలరని తెలిపారు. ఇంకా పూర్తి వివరాలకు రైతులు వారి సమీపంలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని కలవాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో పంటల బీమా పథకం రైతులకు ఎంతో మేలు చేస్తుందని , కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి, వారు తెలియజేశారు. సబ్సిడీ లో మినుము విత్తనాల పంపిణీ: ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ప్రోత్సహించడానికి పల్స్ మిషన్లో భాగంగా ప్రభుత్వం సబ్సిడీ పై వి.బి. ఎన్ .9 రకం మినుములు పంపిణీ చేయడం జరుగుతుందని, ఇందుకు గాను నంద్యాల మండలమునకు 30 క్వింటాలు కేటాయించడం జరిగిందని, వీటిని మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని, పూర్తి ధర: కిలో 129.5/-, సబ్సిడీ 60/- , రైతు వాటా: 69.5/- చెల్లించి మినుములు పొందగలరని వ్యవసాయ అధికారి తెలిపారు.

# పట్టాదార్ పాసుపుస్తకాల జారీ లో మీరు చేసిందేమిటి

**బనగానపల్లెలో అభివృద్ధి జరిగింది వైసిపి హయాంలోనే ముఖ్యమంత్రే జనార్దన్ రెడ్డి పనితీరు బాగాలేదన్నారు మీడియా సమావేశంలో మాజీ శాసన సభ్యులు కాటసాని**

**బనగానపల్లె జులై 10నందిపత్రిక** మీ భూమి మీ హక్కు అంటూ బనగానపల్లె కు వచ్చిన ముఖ్యమంత్రి రైతులకు ఇచ్చిన పాసుపుస్తకాల్లో గత ప్రభుత్వం ఇచ్చిన పట్టాదారు పుస్తకాల్లో ఏ మార్పులు చేసారో తెలిపాలని బనగానపల్లె మాజీ శాసన సభ్యులు కాటసాని రామిరెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం ఆయన స్వగృహం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో మాట్లాడారు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన పాలనలో రైతులకు ఇచ్చిన పాసుపుస్తకాలలో ఆయన ఫొటోను తీసివేసి ఉన్నది ఉన్నట్లుగా మీ భూమి మీ హక్కు అంటూ రైతులకు ఇచ్చారే మరి ఎన్నికల ముందు ల్యాండ్ టైటిల్ యాక్ట్ ను మారుస్తాము జగన్ మోహన్ రెడ్డి మీ భూములు లాక్కునేందుకు తన ఫొటో వేసుకున్నాడని వాటిని కాల్చి వేశారు. మరి అలాంటప్పుడు ఎందుకు వాటిని మార్చకుండా ఇచ్చారని ప్రశ్నించారు. ఇదంతా మీరు లబ్ది పొందడానికి మా నాయకున్ని విమర్శించారాని అన్నారు.

**ముఖ్యమంత్రే మంత్రి పనితీరు బాగాలేదన్నారు** సాక్ష్యత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నియెజకవర్గ మంత్రి బీసి జనార్దన్ రెడ్డి పనితీరు బాగాలేదని బహిరంగ సభలో అనడం సిగ్గుచేటని అన్నారు. 43 శాఖల్లో 32 శాఖల పనితీరు బాగాలేదని ముఖ్యమంత్రి అన్నారని మంత్రి కమిషన్ల కోసం నియెజకవర్గాన్ని భ్రష్టుపట్టించాడని అన్నారు. సామాన్యులు ఏ కార్యాలయానికి వెళ్లిన పనులు చేయడంలేదని అధికారులు నిర్లక్ష్యం గా సమాధానమిస్తున్నారని ఇదేనా అభివృద్ధి అని ప్రశ్నించారు. మంత్రి నోరు తెరిస్తే అబద్ధపు మాటలు, ఛాలెంజ్ లు చేస్తాడని దింతో ప్రజల్లో అసహనం పెరిగిపోయిందన్నారు.

**రవ్వలకొండ పై అడ్డు అదుపులేని అక్రమ మైనింగ్** రవ్వకొండ మీద మంత్రి చేస్తున్న మైనింగ్ కు ఎటువంటి పర్మిషన్లు లేవని అదంతా అక్రమ మైనింగ్ అన్నారు. ప్రక్కనే మోడల్ పాఠశాల, బీసి హాస్టల్ ఉన్నప్పటికీ, బ్లాస్టింగ్ తో విద్యార్థులు భయాందోళన చెందుతున్న మైనింగ్ ఆపడం లేదని ఇదే మంత్రి నిజాయితీ అన్నారు.

**బనగానపల్లె లో వైసీపీ హయాంలో అభివృద్ధి** వైసీపీ హయాంలో నేను శాసన సభ్యునిగా ఉన్నప్పుడు అభివృద్ధి జరిగిందని చెప్పారు. ముదిగేడు సంజామల, నొస్సం నంద్యాల బైపాస్ రోడ్డు లకు మా హయాంలోనే టెండర్లు పూర్తయ్యాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, సచివాలయాలు, ఆసుపత్రులు, హెల్త్ సెంటర్స్, తహసీల్దార్, ఎంపిడిఓ కార్యాలయాలు నేను ఎమ్మెల్యే గా ఉన్నపుడే బనగానపల్లె లో నిర్మించబడ్డాయాయని నీవు ఎక్కడ అభివృద్ధి చేస్తున్నావో ప్రజలు గమనిస్తున్నారన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే నా ప్రధాన లక్ష్యం





## డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి

**నంది పత్రిక –డోన్** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు గౌరవనీయులు కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు . శుక్రవారం డోన్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన ప్రజల నుండి ఆయన స్వయంగా వినతిపత్రాలను స్వీకరించారు.కార్యక్రమానికి వచ్చిన ప్రజలు తమ పరిధిలోని పలు దీర్ఘకాలిక, తక్షణ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.తాగునీటి సరఫరాలో ఎదురవుతున్న అంతరాయాలు అస్తవ్యస్తంగా మారిన అంతర్గత రహదారుల మరమ్మతులు నూతన పింఛన్లు, సాంకేతిక కారణాలతో ఆగిపోయిన పాత పింఛన్ల పునరుద్ధరణవిద్యుత్ సరఫరాలో లోపాలు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుస్థానిక ఆసుపత్రులలో వైద్య, ఆరోగ్య సదుపాయాల మెరుగుదలప్రజలు సమర్పించిన ప్రతి వినతిపత్రాన్ని ఎమ్మెల్యే ఎంతో శ్రద్ధగా పరిశీలించారు. బాధితులతో స్వయంగా మాట్లాడి సమస్యల తీవ్రతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...

అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు."నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే నా సంకల్పం. ప్రజలు తమకు ఎలాంటి సమస్యలు ఉన్నా, ఎప్పుడైనా నేరుగా వచ్చి నన్ను కలవవచ్చు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ఆదోనిలో ఘనంగా ప్రారంభమైన సితార గ్రాండ్ హోటల్

### ఎమ్మెల్యే పార్థసారథి చేతల మీదగా ప్రారంభం

### ఆస్పరి రోడ్లో వైభవంగా ప్రారంభమైన హోటల్



**నంది పత్రిక ఆదోని ప్రతినిధి** ఆదోని పట్టణంలో కొత్త బస్టాండ్ నుండి ఆస్పరికి వెళ్లే మార్గంలో నూతనంగా నిర్మించిన సితార గ్రాండ్ హోటల్ ప్రారంభం శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది ముఖ్య అతిథులుగా ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి హాజరై హోటల్ ను ప్రారంభించాడు ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ఆదోనిలో ఎన్నో హోటల్ ఉన్నాయి కానీ ఈ హోటల్లో ప్రత్యేకత ఏమిటంటే ఉదయాన్నే వెజ్ & నాన్ వెజ్, అలాగే రాగి ముద్ద చికెన్ షేర్వ, ఇంకా మరికొన్ని రాయలసీమ వంటకాలను తయారు చేస్తున్నారు అలాగే ఈ హోటల్ మేనేజ్మెంట్ తిరుపతి నాగార్జున రెడ్డి ఈయన తిరుపతి నుంచి వచ్చి ఆదోనిలో ఈ హోటల్ ప్రారంభించడం జరిగిందని అన్నారు ఈ హోటల్లో అన్ని రకాల అయినా వంట రుచులు అందుబాటులో ఉంటాయన్నారు అలాగే టిఫిన్ వెజ్ అండ్ నాన్ వెజ్ వంటకాలు రుచికరమైన మల్టీ క్యూ జన్ భోజనాలు ఏసీ అండ్ నాన్ ఏసి రూమ్స్ అందుబాటులో ఉన్నాయి అన్నారు అలాగే నాగార్జున రెడ్డికి తిరుపతిలో కూడా రెండు మూడు హోటల్ ఉన్నాయని ఈ హోటల్లో ఈయనకు మంచి పట్టు ఉందని అందుకోసం మన ఆదోని కూడా మంచి రుచికరమైన వంటకాలు చూపించాలని ఉద్దేశంతోనే ఆదోనిలో సీతారా గ్రాండ్ హోటల్ ను ఈయన ప్రారంభించడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో చేకురి ఫంక్షన్ హాల్ అధిపతి ప్రదీప్, నాగరాజు, స్నేహితులు కుటుంబ సభ్యులు భారీగా హాజరయ్యారు

# 14 వ తారీఖు ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు చివరి రోజు



### అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

### ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ కు రాజకీయ పార్టీలు, ప్రజలు పూర్తి సహకారం అందించాలి

### కర్నూలు జిల్లా ఎన్నికల అధికారి/ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** ఎస్.ఐ.ఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ గడువు 14 వ తారీఖున ముగుస్తూ ఉన్నందున పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేయడానికి రాజకీయ పార్టీలు, ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి/ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశంలో కోరారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణపై సమావేశం నిర్వహి నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇక నాలుగు రోజులలో గడువు ముగుస్తూ ఉన్నందున రాజకీయ పార్టీల బిఎల్వోలు సహకరించి ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని రాజకీయ పార్టీలను జిల్లా ఎన్నికల అధికారి కోరారు. ఎన్యుమరేషన్ ఫారాల లక్ష్యాన్ని నిర్దేశించుకుని పంపిణీ , స్వీకరణ కార్యక్రమం క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి అర్హుడైన ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రాజకీయ పార్టీలు తమ తరఫున బూత్ లెవల్ ఏజెంట్లను (బీఎల్ఏలు) నియమించి, బూత్ స్థాయిలో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు సహకరించాలని కలెక్టర్ కోరారు. బి ఎల్ ఓ మరియు బీఎల్ఏల సహకారంతో ఓటర్ల వివరాల పరిశీలన, అర్హుల గుర్తింపు, అవసరమైన సవరణలు మరింత సమర్థవంతంగా జరుగుతాయని తెలిపారు. రేపు రెండవ శనివారం, ఆదివారం రోజుల్లో కూడా జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజలు నేరుగా తమ పోలింగ్ కేంద్రానికి వెళ్లి బీఎల్ఓల వద్ద నుంచి ఎన్యుమరేషన్ ఫారాలను తీసుకుని, 2002 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేసుకుని , పూర్తి వివరాలతో, ఫోటోలతో ఫారాలను నింపి తిరిగి సమర్పించాలని సూచించారు. ఎవరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా ఉండేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఓటరు నమోదు, సవరణలు, మార్పులు , చనిపోయిన వారివి, వేరే ప్రాంతానికి వలస వెళ్లిన వారివి , డబుల్ ఎంట్రీలు మరియు అందుబాటులో లేని వారి ఓట్లు తొలగింపులు వంటి అంశాల్లో ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను పాటిస్తూ బి ఎల్ వో లు , బి ఎల్ ఏ లు 13 వ తారీకు సోమవారం ఉదయం చర్యలు తీసుకుంటారని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఈ విషయంలో రాజకీయ పార్టీలు పూర్తిగా సహకరించాలని కోరారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువు అయిన జూలై 14వ తేదీలోపు ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ా×=) ప్రక్రియను వంద శాతం పూర్తి చేయడానికి జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన కార్యాచరణతో కృషి చేస్తోందని, రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలియజేశారు. జిల్లాలో 250 కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు చేయడం జరిగిందని 48 పోలింగ్ స్టేషన్ల స్థానం మార్పు జరిగిందని కూడా తెలిపారు. బిఎల్ఓ లకు సహకరించడానికి డ్వామా , అంగన్వాడి మొదలగు సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు.ఈ సమావేశానికి డిఆర్ఓ వెంకటనారాయణమ్మ , ఎలక్షన్ సెల్ సూపరింటెంట్ మురళి , బిజెపి పార్టీ ప్రతినిధి సాయి ప్రదీప్ , తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు ఎల్వి ప్రసాద్ , మధు బాబు నాయుడు , జనసేన పార్టీ తరపున మంజునాథ్ , బహుజన సమాజ్ పార్టీ తరపున అరుణ్ కుమార్ , వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఎస్. ఏ.షరీఫ్ మరియు అంజి , కమ్యూనిస్టు పార్టీ తరపున గౌస్ దేశాయ్ , ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున లాజరస్ పాల్గొన్నారు.




# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

### 12వ తేదీలోపు క్షేత్రస్థాయి తనిఖీలు పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల బ్యూరో, జూలై 10(నంది పత్రిక):–** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ సార్ ) ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ప్రతి దశను నాణ్యతతో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఎన్నికల నమోదు అధికారులు సహాయ ఎన్నికల నమోదు అధికారులు తక్కువ పురోగతి సాధించిన బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డి. రాముల నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దేశంలోని ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో పారదర్శకంగా, తప్పులులేకుండా రూపొందించడం ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యమని తెలిపారు. అదే సమయంలో ఓటు హక్కు దుర్వినియోగానికి అవకాశం లేకుండా, ఖచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు భారత ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఓటర్ల జాబితాలో నమోదైన మరణించిన ఓటర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు నివాసం మార్చుకున్న వారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు నమోదైన (డబుల్ ఎంట్రీలు) ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. బూత్ లెవల్ ఏజెంట్ ధృవీకరణతో పాటు అవసరమైన క్షేత్రస్థాయి విచారణ నిర్వహించి, అర్హత లేని నమోదులను ఈ నెల 12వ తేదీలోపు తొలగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఎన్యూమరేషన్ ఫారాలను త్వరితగతిన సేకరించాలని, సేకరించిన ఫారాలను ఆలస్యం చేయకుండా వెంటనే డిజిటలైజేషన్ చేయాలని బీఎల్ఓలను ఆదేశించారు. ఎక్కడా పెండింగ్ లేకుండా ప్రతిరోజూ లక్ష్యాలను పూర్తి చేస్తూ పురోగతిని నమోదు చేయాలని, ఈ ప్రక్రియలో నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతం కావాలంటే క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా ధృవీకరించి, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# అర్జీదారులు సంతృప్తి చెందేలా రెవెన్యూ సమస్యలను నాణ్యతతో పరిష్కరించాలి



### టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

### సిసిఎల్ఏ కార్యాలయం జాయింట్ సెక్రెటరీ (ల్యాండ్స్) లీడ్ ఆఫీసర్ టి.ఎస్ చేతన్

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజా సంతృప్తే లక్ష్యంగా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి లోపాలను వెంటనే సరిదిద్దాలని జిల్లా కలెక్టర్ డా.ఏ

సిరి, సిసిఎల్ఏ కార్యాలయం జాయింట్ సెక్రటరీ(ల్యాండ్స్), ా+=ా లీడ్ ఆఫీసర్ టి.ఎస్ చేతన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 29, 2026న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (ా+=ా)లో రెవెన్యూ శాఖకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లాలకు నియమించిన లీడ్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలు నిర్వహించే విధంగా ఆదేశాలు జారీ చేయడం జరిగింది. అందులో భాగంగా కర్నూలు జిల్లాకు లీడ్ ఆఫీసర్‌గా నియమితులైన టి.ఎస్.చేతన్, జిల్లా కలెక్టర్ తో కలిసి రెవెన్యూ అధికారులతో శుక్రవారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా పీజీఆర్ఎస్, ఇతర రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, జాయింట్ సెక్రటరీ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ద్వార ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో పీజీఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదులు, వాటి పరిష్కార స్థితి, పెండింగ్ కేసులు, రీఓపెన్ అయిన ఫిర్యాదుల సంఖ్య, రీఓపెన్ కావడానికి గల కారణాలు, పరిష్కార ప్రక్రియలో ఉన్న లోపాలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఫిర్యాదుల పరిష్కారంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు సంతృప్తికరమైన పరిష్కారం అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. రీఓపెన్ అయ్యే ఫిర్యాదులను తగ్గించేలా క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించి, వాస్తవ పరిస్థితులను పరిశీలించిన అనంతరం మాత్రమే ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. అధిక సంఖ్యలో అర్జీలు వస్తున్న ప్రాంతాల్లో వాటి మూల కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పదే పదే వస్తున్న అర్జీలను తగ్గించేందుకు తహసీల్దార్లు ప్రతి అర్జీపై స్పష్టమైన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని, సాధ్యం కాని అంశాలపై కారణాలను అర్జీదారులకు స్పష్టంగా వివరించాలని ఆదేశించారు. ప్రజల్లో రెవెన్యూ శాఖపై సానుకూల అభిప్రాయం పెంపొందించే దిశగా తహసీల్దార్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. పారదర్శకంగా ప్రజలకు సేవలు అందించాలని, ప్రతి అర్జీని విధిగా నమోదు చేసి నిర్ణీత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మాట్లాడుతూ...రీ-సర్వే కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 277 గ్రామాల్లో ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన 212 గ్రామాల్లో కూడా వచ్చే ఏడాది మార్చి నెలలోపు పూర్తి చేయడానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. మొదటి విడతలో రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీని జూలైఆగస్టు నెలల్లో పూర్తిచేయనున్నట్లు వివరించారు. పాస్ పుస్తకాల పంపిణీ సందర్భంగా ప్రతి లబ్ధిదారుడికి తప్పనిసరిగా ఈ-కేవైసీ నిర్వహిస్తున్నామని, తుది పాస్ పుస్తకాల పంపిణీ సమయంలో కూడా మరోసారి ఈ-కేవైసీ చేపట్టి పూర్తి స్థాయిలో ధృవీకరణ చేస్తున్నామని తెలిపారు. పాస్ పుస్తకాల ముద్రణ ప్రక్రియ కూడా దాదాపు 90 శాతం పూర్తయిందని వెల్లడించారు. రీ-సర్వేలో తలెత్తే సాంకేతిక, రికార్డు సంబంధిత లోపాలను ముందుగానే గుర్తించి సరిదిద్దేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వెబ్ ల్యాండ్ రికార్డులు, డీఎల్ఆర్ డేటా, భూ యాజమాన్య వివరాలను పరస్పరం పరిశీలించి, భవిష్యత్తులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సవరణలు చేస్తున్నట్లు వివరించారు. రీ-సర్వే, రెవెన్యూ సేవలు, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ తదితర అంశాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.ఈ టెలీ కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డీఆర్ఓ వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీత బాయి, సిపిఓ భారతి, ఉపాధి కల్పనాధికారి దీప్తి , సర్వే ఏడి మురళి, ఆర్డీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.




## ఒకే స్క్రిప్ట్‌తో... ఆ ముగ్గురూ పవన్‌ను టార్గెట్ చేశారు: మంత్రి కందుల దుర్గేశ్

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు వైసీపీ భారీ కుట్రకు తెరలేపిందని, అందులో భాగంగానే జడా శ్రావణ్ కుమార్, నటుడు ప్రకాశ్ రాజ్, యూట్యూబర్ జోసెఫ్ రావణ్ పనిచేస్తున్నారని రాష్ట్ర మంత్రి, జనసేన నేత కందుల దుర్గేశ్ సంచలన ఆరోపణలు చేశారు. పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ ముగ్గురూ తాడేపల్లి నుంచి వస్తున్న ఒకే స్క్రిప్ట్‌ను అమలు చేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మేధావుల ముసుగులో వీరు చేస్తున్న ప్రయత్నాలు, వైఎస్ జగన్‌తో జడా శ్రావణ్ భేటీ కావడంతో బట్టబయలయ్యాయని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేశ్, జడా శ్రావణ్‌ను లక్ష్యంగా చేసుకుని పలు సూటి ప్రశ్నలు సంధించారు. "జగన్‌పై పోరాటానికి రూ. 25 కోట్లు సొంత డబ్బులు ఖర్చు పెట్టానని చెప్పిన శ్రావణ్‌కు అంత సొమ్ము ఎలా వచ్చిందో చెప్పాలి. ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఆయన, తక్కువ కాలం జడ్జిగా పనిచేసి, తర్వాత సాధారణ న్యాయవాదిగా ఉన్నారు. అలాంటి వ్యక్తికి అంత డబ్బు ఎలా వస్తుంది? మాకు తెలిసిన సమాచారం ప్రకారం, అవినీతి కేసుల్లో ఉండటం వల్లే ఆయన జడ్జి ఉద్యోగానికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అలాగే, సుగాలి ప్రీతి తల్లిని మోసం చేసిన మాట వాస్తవం కాదా?" అని దుర్గేశ్ నిలదీశారు. పవన్ కల్యాణ్ ఏనాడూ శ్రావణ్ ప్రస్తావన తేకపోయినా, కేవలం వైసీపీ ఆదేశాలతోనే శ్రావణ్ పదేపదే పవన్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారని విమర్శించారు. జోసెఫ్ రావణ్, శ్రావణ్, ప్రకాశ్ రాజ్‌ల మధ్య ఉన్న 'క్యాష్ బంధం' ఏంటో బయటపెట్టాలని దుర్గేశ్ డిమాండ్ చేశారు. "రావణ్‌ను అరెస్ట్ చేస్తే శ్రావణ్ ఎందుకు అంతగా ఇబ్బంది పడుతున్నారు? ప్రశ్నించే హక్కు అంటే బూతులు తిట్టడమేనా? వ్యక్తిత్వ హననం చేసేవారిని వెనకేసుకు రావడమేనా మీ పని?" అని ప్రశ్నించారు. ఈ ముగ్గురూ కలిసి ఏపీలో క్రైస్తవులను రెచ్చగొట్టి మతాల మధ్య ఘర్షణలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, దీని వెనుక వైసీపీ ఎజెండా స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు.

# జిల్లాలో సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు విస్తృత అవకాశాలు






### 'వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్‌ప్రెన్యూర్' లక్ష్యంగా మరిన్ని మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌ను ప్రోత్సహించాలి

### విశ్వనగర్‌లో పీఎంఎఫ్‌ఎంఈ పథకం కింద ఎస్ఎస్ డైరీ యూనిట్‌ను సందర్శించి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, జూలై 10(నంది పత్రిక):-** జిల్లాలో ఆహార శుద్ధి పరిశ్రమలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకొని గ్రామీణ యువత, మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని విశ్వనగర్ లో ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద ఏర్పాటు చేసిన ఎస్ఎస్ డైరీ మిల్క్ అండ్ కర్డ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను కలెక్టర్ ప్రారంభించారు. యూనిట్‌లో తయారు చేస్తున్న పాలు, పెరుగు, మజ్జిగ, నెయ్యి, ఫ్లేవర్డ్ మిల్క్ తదితర ఉత్పత్తుల తయారీ ప్రక్రియను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పీఎంఎఫ్‌ఎంఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో చిన్న తరహా ఆహార శుద్ధి పరిశ్రమలకు ప్రభుత్వం సబ్సిడీతో పాటు బ్యాంకుల ద్వారా క్రెడిట్ లింక్డ్ రుణ సదుపాయం కల్పిస్తోందన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని స్థానిక వనరుల ఆధారంగా మరిన్ని పరిశ్రమలను స్థాపించాలని సూచించారు. విశ్వనగర్‌లో ఏర్పాటు చేసిన ఈ మిల్క్ అండ్ కర్డ్ ప్రాసెసింగ్ యూనిట్ సుమారు రూ. 18.14 లక్షల వ్యయంతో స్థాపించబడిందన్నారు. ఇందులో ప్రభుత్వం నుంచి రూ. 6.35 లక్షల సబ్సిడీ, బ్యాంకు ద్వారా రుణం, యజమాని స్వంత పెట్టుబడితో యూనిట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా యంత్రాంగం, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయడం వల్ల ఈ యూనిట్ విజయవంతంగా స్థాపించబడిందని తెలిపారు. ఇలాంటి సూక్ష్మ పరిశ్రమలు గ్రామీణ ప్రాంతాల్లో కుటీర పరిశ్రమలుగా అభివృద్ధి చెందడంతో పాటు స్థానికంగా ఐదు నుంచి పది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. సమర్థవంతంగా నిర్వహిస్తే నెలకు రూ. 2 నుంచి రూ. 3 లక్షల వరకు ఆదాయం ఆర్జించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇటువంటి పరిశ్రమలు కుటుంబాల ఆర్థికాభివృద్ధికి, గ్రామీణ ఉపాధి విస్తరణకు దోహదపడతాయని తెలిపారు. జిల్లాకు పీఎంఎఫ్‌ఎంఈ పథకం కింద మొత్తం 56 యూనిట్ల లక్ష్యం ఉండగా, ఇప్పటివరకు 26 యూనిట్లకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరయ్యాయని తెలిపారు. మిగిలిన యూనిట్లను కూడా రాబోయే రెండు మూడు నెలల్లో పూర్తి చేసేలా అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశు సంవర్ధక, మత్స్యశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి స్థానిక వనరులకు అనుగుణంగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి మరిన్ని మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. బ్యాంకర్లు అర్హులైన లబ్ధిదారులకు రుణాలను సత్వరమే మంజూరు చేసి స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించాలని కోరారు. 'వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్' లక్ష్యంతో ప్రతి కుటుంబంలో కనీసం ఒక పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దే దిశగా జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. దీని ద్వారా జిల్లా స్థూల ఆర్థికాభివృద్ధి, తలసరి ఆదాయం పెరగడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో జిల్లాలో మిల్లెట్స్ ప్రాసెసింగ్, తేనె సేకరణ మరియు ప్రాసెసింగ్, ఫ్లోరికల్చర్ ఆధారిత విలువ ఆధారిత ఉత్పత్తులు, డ్రై ఫ్రూట్స్, వెట్ ఫ్రూట్స్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో కూడా పెద్ద ఎత్తున సూక్ష్మ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. నాబార్డ్ ఏజీఎం కార్తికేయ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, జిల్లా పశు సంవర్ధక అధికారి గోవింద నాయక్, ఎల్డిఎం అయ్యప్ప రెడ్డి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



# మండల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలి

### ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి



**ఆళ్లగడ్డ ప్రతినిధి జూలై 10 నంది పత్రిక** ఆళ్లగడ్డ మండల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి పేర్కొన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఎంపీపీ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందజేయడంలో ఎంపీటీసీలు కలిసి అధికారులు చొరవ చూపాలన్నారు. తాసిల్దార్ జ్యోతి రత్నకుమారి మాట్లాడుతూ సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లు 14వ తేదీ లోపు ఎనుమరేషన్ పత్రంలో తమ వివరాలను పొందుపరిచి బిఎల్వోలకు తప్పనిసరిగా అందజేయాలని ప్రత్యేక ఓటర్ జాబితా సవరణలో భాగస్వాములు కావాలని ప్రజల అనుమానాలను నివృత్తి త్తి చేసేందుకు గ్రామాల్లోని సచివాలయాలలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారని శని ఆదివారం కూడా ఈ కార్యక్రమం ఉంటుందని తాసిల్దార్ సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో రాఘవేంద్ర రాజు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం, చెత్త నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పంచాయతీ అధికారులు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. మండల వ్యవసాయ అధికారి కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎలినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు పై రైతులు అక్రమంగా ఉండాలని తెలిపారు విద్యుత్ శాఖ ఏఈ శివకుమార్ విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. మండలంలోని విద్య, పశు వైద్యం, రోడ్లు ,వసతి గృహాలు, గృహ నిర్మాణ, ఐసిడిఎస్ శాఖల అధికారులు వారి ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నాసారి లక్ష్మీ నరసింహ ప్రసాదు, ఎంపీడీవో నూర్జహాన్ బేగం ,ఎంపీటీసీలు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 99.97 శాతం ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశాం

### 74.18 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి

### ప్రతి రాజకీయ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్ ను నియమించుకోవాలి

### కొత్తగా 134 పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు

### స్థల మార్పిడికి 45, పేరు మార్పులకు 13 పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




**నంద్యాల బ్యూరో, జూలై, 10(నంది పత్రిక):-** ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా సమగ్ర సవరణ) ప్రక్రియలో భాగంగా 99.97 శాతం ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశామని తిరిగి ఇచ్చిన ఫారాలను 74.18 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా సమగ్ర సవరణ)పై రాజకీయ పార్టీ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిఆర్ఓ రామునాయక్, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు బిజెపి పార్టీ ప్రతినిధి కె.చంద్రశేఖర్, టిడిపి పార్టీ ప్రతినిధి ఎం.రామ్మోహన్, వైఎస్సార్సీపీ పార్టీ ప్రతినిధి సాయిరామ్ రెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి ప్రదీప్, జనసేన పార్టీ ప్రతినిధి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా సమగ్ర సవరణ) ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రతి రాజకీయ పార్టీ ప్రతినిధులు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలని రాజకీయ పార్టీ ప్రతినిధులకు కలెక్టర్ సూచించారు. బిఎల్ఓ, బిఎల్ఏ సమన్వయంతో పని చేయడం ద్వారా ఓటర్లకు ఎస్ఐఆర్ పై అవగాహన కల్పిస్తూ త్వరితగతిన పూర్తి అయ్యే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాల్లో 1200 ఓటర్లకు మించి ఉండకూడదనే నిబంధనలో భాగంగా కొత్తగా 134 పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 1629 పోలింగ్ కేంద్రాలు ఉండడం జరిగిందని వాటిలో ఆళ్లగడ్డలో 298 పోలింగ్ కేంద్రాలు ఉండగా కొత్తగా 14 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు (పోలింగ్ కేంద్రాల స్థల మార్పిడికి 9) మొత్తంగా 312 పోలింగ్ కేంద్రాలు అవుతాయని, శ్రీశైలంలో 226 పోలింగ్ కేంద్రాలు ఉండగా కొత్తగా 13 కొత్త పోలింగ్ కేంద్రాలు చేయగా (స్థల మార్పిడికి 8, పేరు మార్పిడికి 5) మొత్తంగా 239 అవుతాయని, నందికొట్కూరులో 251 పోలింగ్ కేంద్రాలు ఉండగా కొత్తగా 25 పోలింగ్ కేంద్రాలు చేయగా (స్థల మార్పిడికి 1, పేరు మార్పిడికి 2) మొత్తంగా 276 అవుతాయని, నంద్యాలలో 286 పోలింగ్ కేంద్రాలు ఉండగా కొత్తగా 48 కొత్త పోలింగ్ కేంద్రాలు చేయగా (స్థల మార్పిడికి 20, పేరు మార్పిడికి 6) మొత్తంగా 334 అవుతాయని, బనగానపల్లెలో 277 పోలింగ్ కేంద్రాలు ఉండగా కొత్తగా 29 కొత్త పోలింగ్ కేంద్రాలు చేయగా మొత్తంగా 306 అవుతాయని, డోన్ లో 291 పోలింగ్ కేంద్రాలు ఉండగా కొత్తగా 5 కొత్త పోలింగ్ కేంద్రాలు చేయగా (స్థల మార్పిడికి 7) మొత్తంగా 296 అవుతాయని రాజకీయ పార్టీ ప్రతినిధులకు కలెక్టర్ వివరించారు. అదే విధంగా ఏ ఒక్క పోలింగ్ కేంద్రాలు కూడా ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందజేత

### కుమార్తెల విద్యాభ్యాసానికి ముఖ్యమంత్రి చేయూత

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, జూలై 10(నంది పత్రిక):-** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 9వ తేదీన బనగానపల్లె పర్యటన సందర్భంగా విద్యాభ్యాసానికి ఆర్థిక సహాయం కోరిన కుటుంబానికి మంజూరు చేసిన రూ. 2 లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పేద మరియు అవసరమైన కుటుంబాల పిల్లల ఉన్నత విద్యాభ్యాసానికి అన్ని విధాలా అండగా నిలుస్తోందన్నారు. ఈ నెల 9న బనగానపల్లె మండలంలో నిర్వహించిన "మీ భూమి – మీ హక్కు" కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీలో పాల్గొన్న సందర్భంగా బేతంచర్ల మండలం గూటుపల్లె గ్రామానికి చెందిన కాదారమ్మ లక్ష్మి తన కుమార్తెల విద్యాభ్యాసానికి ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. ఆ వినతిపై సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి, కుమార్తెల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇస్తూ తక్షణమే అవసరమైన సహాయం అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కుమార్తెల విద్యాభ్యాసం కోసం రూ. 2 లక్షల ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారుల కుటుంబానికి అందజేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. విద్య ద్వారానే కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతాయని, ప్రతి విద్యార్థి తన లక్ష్యాలను సాధించేలా ప్రభుత్వం అవసరమైన సహకారాన్ని అందిస్తోందని కలెక్టర్ తెలిపారు.

జిల్లా రెవెన్యూ అధికారి డి. రాము నాయక్, డోన్ ఆర్డీఓ నరసింహులు, బేతంచర్ల తహశీల్దార్ నాగమణి తదితర అధికారులు పాల్గొన్నారు.



# దేవాలయాల అభివృద్ధికి కృషి చేయండి





### ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**దొర్నిపాడు జూలై 10 నంది పత్రిక** దేవాలయాలపాలక ధర్మకర్తల మండలి సభ్యులు దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు,దొర్నిపాడు మండల పరిది లోని చాకరాజు వేముల గ్రామంలొ శుక్రవారం ఆలయ ఈవో బాల చెంచన్న ఆధ్వర్యంలోచెన్న కేశ్వర స్వామి ఆలయాధర్మ కర్తగ ఎండూరి గోపాల్ నాయుడు, పాలక మండలి సభ్యులు,కేశవ నాయుడు,తిమ్మరాజు, సుబ్బరాయుడు,పి. సావిత్రి,తిరుపతమ్మ, అక్కలసావిత్రిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ప్రమాణ స్వీకారకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే,భూమా అఖిలప్రియ హాజరై ఆలయ ధర్మ కర్త ఎండూరి గోపాల్ నాయుడు.

**పాలకమండలిసభ్యులకుఅభినందనలుతెలియజేశారు.**

అనంతరం ఆలయంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియతో అర్చకులు నరసింహారావు ప్రత్యేకపూజలు చేయించారు, ఈ కార్యక్రమంలోటీడీపీ,నాయకులు. వడ్లమూడిచెలమయ్య,గంగవ రం కృష్ణ రెడ్డి,లింగుట్లవెంకట నాయడు,శేఖర్ చౌదరి, శేషప్ప చౌధరి,భూమాప్రతాప్ రెడ్డి,చక్రవర్తి నాయుడు, బూసి రెడ్డి భాస్కర్ రెడ్డి,కొత్తపల్లి సురేంద్ర, దయానందరావు,డీలర్ హబీబ్ భాషా,డాక్టర్ వర ప్రసాద్, బుజ్జి, వాసు, అంజి. తదితరులు పాల్గొన్నారు

**పాలకమండలిసభ్యులకుఅభినందనలుతెలియజేశారు.**

అనంతరం ఆలయంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియతోపురోహితులు నరసింహారావు ప్రత్యేకపూజలు చేయించారు,ఈకార్యక్రమంలొ,టీడీ,పీ,నాయకులు. వడ్లమూడిచె ల మయ్య,గంగవరం కృష్ణ రెడ్డి,లింగుట్లవెంకట నాయడు,శేఖర్



చౌదరి, శేషప్ప చౌ ధరి,భూమాప్రతాప్ రెడ్డి,చక్రవర్తి నాయుడు, బూసి రెడ్డి భాస్కర్ రెడ్డి,కొత్తపల్లి సురేంద్ర, దయానందరావు,డీలర్ హబీబ్ భాషా,డాక్టర్ వర ప్రసాద్, బుజ్జి, వాసు, అంజి. తదితరులు పాల్గొన్నారు



# సమాచార హక్కు చట్టం అమలులో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలి..!

## రాష్ట్ర సమాచార కమిషనర్ వంటేరు రవిబాబు
## ఆర్‌టీఐ రికార్డుల నిర్వహణపై ఆకస్మిక తనిఖీలు
## లోపాలున్న కార్యాలయాలకు షోకాజ్ నోటీసులు, చక్కటి నిర్వహణకు అభినందనలు



**కడప, బ్యూరో చీఫ్ జూలై 10 నంది పత్రిక:** సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) అమలులో ప్రభుత్వ కార్యాలయాలు.. పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరించాలని రాష్ట్ర సమాచార కమిషనర్ వంటేరు రవిబాబు అధికారులకు సూచించారు. శుక్రవారం వైఎస్సార్ కడప జిల్లా పర్యటనలో భాగంగా ఆయన కడప, సీకే దిన్నె మండల పరిధిలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి ఆర్‌టీఐ రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్టీఐ కమిషనర్ వంటేరు రవిబాబు.. మొదట కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేయగా నిర్వహణ సంతృప్తికరంగా ఉందని అభినందించారు.

అనంతరం కడప జిల్లా కోర్టును సందర్శించి ఆర్‌టీఐ చట్టంలోని 4(1)(బి) నిబంధనల ప్రకారం తప్పనిసరిగా నిర్వహించాల్సిన సమాచారాన్ని అందుబాటులో ఉంచకపోవడంతో సంబంధిత ప్రజా సమాచార అధికారికి (పీఐఓ) షోకాజ్ నోటీసు జారీ చేశారు. తర్వాత చింతకొమ్మదిన్నె మండలంలోని మూలవంక స్వర్ణ గ్రామ సచివాలయంలో కూడా 4(1)(బి) నిబంధనల అమలులో లోపాలు గుర్తించి సంబంధిత అధికారికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. అనంతరం నాగిరెడ్డిపల్లి స్వర్ణ గ్రామ సచివాలయంలో తనిఖీ నిర్వహించి అక్కడ కూడా 4(1)(బి) నిబంధనల ప్రకారం వివరాలు నిర్వహించకపోవడంతో షోకాజ్ నోటీసు ఇచ్చారు. తెలుగు గంగా కార్యాలయంలో ఆర్‌టీఐ రికార్డుల నిర్వహణలో లోపాలు గుర్తించి సంబంధిత ప్రజా సమాచార అధికారికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. చింతకొమ్మదిన్నె తహసీల్దార్ కార్యాలయం, చింతకొమ్మదిన్నె ఎంపీడీవో కార్యాలయంలను పరిశీలించగా రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండటంతో అధికారులను అభినందించారు. ఊటుకూరు వార్డు పరిపాలన సచివాలయంలో ఆర్‌టీఐ వివరాల బోర్డు, డీఆర్టీఎస్‌ఐఎల్‌ఎస్ బోర్డు ప్రదర్శించకపోవడంతో సంబంధిత వార్డు పరిపాలన అధికారికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. అలాగే సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్వో) ఆర్‌టీఐ వివరాల బోర్డు నిర్వహించకపోవడంపై కూడా షోకాజ్ నోటీసు ఇచ్చారు. చివరగా కడప జిల్లా కలెక్టరేట్ లోని ఏవో కార్యాలయాన్ని, జిల్లా ఖజానా కార్యాలయం, గృహ నిర్మాణ శాఖ తదితర కార్యాలయంలలో ఆర్‌టీఐ రికార్డులను పరిశీలించిన రాష్ట్ర సమాచార కమిషనర్, అక్కడి రికార్డుల నిర్వహణపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేసి సంబంధిత అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా వంటేరు రవిబాబు మాట్లాడుతూ, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఆర్‌టీఐ చట్టంలోని 4(1)(బి) నిబంధనల మేరకు స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు నవీకరించి ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. పౌర సేవల ప్రణాళిక (సిటిజన్ చార్టర్), ప్రజా సమాచార అధికారుల వివరాలు, ఆర్‌టీఐ సమాచారం ప్రదర్శించే బోర్డులు స్పష్టంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజలకు సమాచారాన్ని సకాలంలో అందించే విధంగా చట్టంలోని నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, ప్రతి కార్యాలయంలో రికార్డుల నిర్వహణ, పౌర సేవల సమాచార ప్రదర్శన సక్రమంగా ఉండాలని సూచించారు. రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదే సమయంలో ఆదర్శంగా రికార్డులు నిర్వహిస్తున్న కార్యాలయాలను ఇతర శాఖలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

# పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి ఆరోగ్యవంతులుగా ఉండండి

## సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ.



**బద్వేల్, జులై 10 (నంది పత్రిక )** పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వలన ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని, సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ అన్నారు. బద్వేల్ మండలంలోని, శీలం వారి పల్లెలో, శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం జరిగింది. వైద్య సిబ్బంది బ్యానర్ చేతపట్టి, ర్యాలీని నిర్వహించారు. దోమ పుట్టకూడదు, కుట్టకూడదు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి ,అర్హులైన వైద్యులచే వైద్యం చేయించుకోండి అంటూ నినాదాలు చేసి, ప్రజలను చైతన్యవంతం చేశారు. ఇంటింటి ఫీవర్, లార్వా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ, జూలై మాసంలో వర్షాలు పడే అవకాశం ఉందని, దోమలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ దోమల వలన మలేరియా, డెంగ్యూ ,చికెన్ గున్యా, పైలేరియా, మెదడువాపు వ్యాధి వచ్చే ప్రమాదం ఉందన్నారు. దోమలు పుట్టకుండా లార్వాదశలోనే నివారించాలన్నారు. జ్వరాలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. అవసరమైన చోట మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల చివరి వరకు డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి వారం ఫ్రైడే డ్రైడే నిర్వహించి, ఇళ్లల్లో నిల్వ ఉన్న నీటిని పడవేస్తున్నామన్నారు.

**శీలం వారి పల్లె బైపాస్ రోడ్డులో రక్తపరీక్షలు.** శీలం వారి పల్లె బైపాస్ రోడ్డులో నిర్మాణ పనులు చేయుచున్న కార్మికులకు రక్త నమూనాలు సేకరించడం జరిగింది. అవసరమైన వారికి మందులను ఉచితంగా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు వీరి జనార్దన్ రావు, శ్రీరామయ్య, వెంకటసుబ్బయ్య ,వైద్య సిబ్బంది ,నాగమణి ,ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రపంచ శాంతికి భగవద్గీతనే మార్గదర్శి

## డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు.
## ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు



**నంద్యాల బ్యూరో, జులై 10(నంది పత్రిక):-** ప్రపంచంలో శాశ్వత శాంతి నెలకొనాలంటే వ్యక్తిలో విలువలు, సమాజంలో ధర్మం, నాయకత్వంలో నిష్కామ సేవాభావం ఉండాలని, ఈ మూడు అంశాలను సమగ్రంగా బోధించిన మహాగ్రంథం భగవద్గీత మాత్రమేనని ప్రముఖ సంస్కృత పండితులు, వ్యాఖ్యాత, ధార్మిక ప్రవచకులు డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు అన్నారు. నంద్యాల పట్టణం, బాల్కొండ హాలువద్ద వెలసిన శ్రీ మోక్షరామచంద్రస్వామి దేవస్థానం నందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ముగిశాయి. మూడు రోజులు , శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, ప్రముఖ వైద్యులు గెలివి సహదేవుడు, సీతారామాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు డి.మధు సుధన్ రావు, డి.రాంప్రసాద్, వీరన్న, రామ్మూర్తి, శ్రీనివాసులు, పవన్ కుమార్, శంతన్, మనోజ్, నవనీత్, రామకృష్ణతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థికి పూర్వవిద్యార్థి ఆర్థిక సహాయం

**కొత్తపల్లి - నంది పత్రిక :** మండల కేంద్రంలో 2025-26 సంవత్సరంలో 10వ తరగతి ఫలితాల్లో పాఠశాల మొదటి స్థానంలో మార్కులు సాధించిన విద్యార్థిని ప్రియాంక కు గ్రామ పూర్వ విద్యార్థి అయిన నూనె చిన్న మల్లయ్య ప్రథమ బహుమతిగా మూడు వేల రూపాయలు శుక్రవారం అందించారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదివి మంచి మార్కులు సాదించాలని ఆకాక్షించారు. దాత మల్లయ్యను ప్రధాన ఉపాధ్యాయులు వెంకటరమణ ఎమండల విద్యాశాఖ అధికారి నాగరాజు, పాఠశాల సిబ్బంది పూలమాల దుశ్శాలువలతో సన్మానించారు.

# మర్రిపాడు లో నియోజవర్గ స్థాయి ఫిజికల్ డైరెక్టర్ల సమీక్షా సమావేశం



**మర్రిపాడు జులై 10నంది పత్రిక :** ఆత్మకూరు నియోజవర్గ స్థాయి ఫిజికల్ డైరెక్టర్ల సమీక్షా సమావేశం మర్రిపాడు ఉన్నత పాఠశాల నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ మహబూబ్ బాషా హాజరై నియోజకవర్గంలోని ఫిజికల్ డైరెక్టర్లకు విద్యార్థులలో క్రీడా నైపుణ్యాలను పెంపొందించడానికి తీసుకోవలసిన చర్యల గురించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల శారీరక మానసిక వికాసానికి,ఆత్మవిశ్వాసానికి,జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోవడానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని,అన్ని పాఠశాలలోని ఫిజికల్ డైరెక్టర్లు విద్యార్థులలోని క్రీడా నైపుణ్యాలను వెలికితీయడానికి,వారిని ఉత్తమ పౌరులుగా తయారు చేయడానికి సమర్థవంతంగా కృషి చేయాలని అన్నారు. అనంతరం మర్రిపాడు ఉన్నత పాఠశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ కు సంబంధించి వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-1 తిరుపతయ్య,మండల విద్యాశాఖ అధికారి-2 ధనలక్ష్మి,మర్రిపాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మలత,ఆత్మకూరు నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు,ఇతర ఉపాధ్యాయులు,సి.ఆర్.ఎం.టి లు తదితరులు పాల్గొన్నారు.

# సర్ లో సందేహాలా.. హెల్ప్ డెస్క్ ను సంప్రదించండి.

## హెల్ప్ డెస్క్ నెంబర్. 9000822909.
## నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి శారదా దేవి.



**తిరుపతి బ్యూరో చీఫ్ జులై 10 నంది పత్రిక** ప్రత్యేక ఓటర్ల సవరణ ( ఎస్ ఐ ఆర్) ప్రక్రియలో ఏవైనా సందేహాలు ఉంటే నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ నెంబర్ 9000822909 ను సంప్రదించాలని తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి శారదా దేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నియోజకవర్గ పరిధిలోని జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల సవరణ( ఎస్ ఐ ఆర్) ప్రక్రియ ఈ నెల 14తో ముగియనుందని తెలిపారు. ప్రజలకు ఇందులో ఏవైనా సందేహాలు ఉన్నచో పరిష్కరించేందుకు నగరపాలక సంస్థ కార్యాలయం తో పాటు నగరంలోని 46 కేంద్రాల వద్ద హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేశామని తెలిపారు. కావున హెల్ప్ డెస్క్ నెంబర్ 9000822909 ను సంప్రదించి మీ సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని కమిషనర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# ఎస్సీ ఎస్టీ కేసు నమోదు

## - ఎస్సై జయ శేఖర్

**కొత్తపల్లి - నంది పత్రిక :** పొలం విషయంలో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ కారణంగా స్థానిక పోలీసు స్టేషన్ నందు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జయశేఖర్ శుక్రవారం రాత్రి తెలిపారు. వివరాల్లోకి వెలితే కె.సురేష్ బాబుకు దుద్యాల గ్రామం పొలిమేరలో మూడు ఎకరాల పొలం ఉంది. వీరి పొలం పక్కనే అదే గ్రామానికి చెందిన మొల్ల భాష, ఇతని కుమారుడు మొల్ల అష్రఫ్ అను వారికి కూడా పొలం ఉంది. అయితే ఈ పొలాల విషయంలో ఇరువురికి గొడవలు ఉన్నాయి. దీంతో సర్వేయర్ల సమక్షంలో పొలం కొలతలు వేయించుకోవాడానికి ఈనెల 8 వతేదిన ఇరు వర్గాలు గ్రామ పొలిమేరలోని కొలతలు వేయిస్తున్నారు. ఈ క్రమంలో మొల్ల భాష, అతని కుమారుడు మొల్ల అష్రఫ్ లు కనక సురేష్ను మాపొలం మధ్య నీవు ఉండకూడదు అని కూలం పేరుతో దూషించి పక్కనే ఉన్న రాయితో కంటిపై బాగాన కొట్టి రక్త గాయం చేశారు. దీంతో కనక సురేష్ ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స తీసుకొని శుక్రవారం పోలీసు స్టేషన్లో పిర్యాదు చేశాడని చెప్పారు. అతని పిర్యాదు మేరకు మొల్ల భాష, అష్రాఫ్లపై ఎస్సీ, ఎస్టీ కేసునమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

# ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

**జూపాడుబంగ్లా: జులై :10: (నంది పత్రిక)** మండల పరిధిలోని భాస్కరపురం గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 61వ జన్మదిన వేడుకలు సందర్భంగా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు విజ్జి ముఖ్యఅతిథిగా హాజరై దండోరా జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదిగల ఆస్తిత్వము, ఆత్మగౌరవం కోసం మందకృష్ణ మాదిగ 32 ఏళ్లుగా అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు . మూడు దశాబ్దాల సుదీర్ఘ పోరాటలతోనే ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ సాధ్యమైందని గుర్తు చేశారు. ఈ వర్గీకరణ ఫలితాలను అందిపుచ్చుకొని మాదిగ ఉప కులాలు ప్రజలు విద్య ఉద్యోగ రంగాలలో ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. మాదిగల మహాత్ముడు సబండ కులాల ఆశాజ్యోతి పద్మశ్రీ గ్రహీత మందకృష్ణ మాదిగ రాష్ట్రంలో మాదిగ కులస్తుల కోసం ఉదయించిన సూర్యుడు ఎస్సీ వర్గీకరణ సాధన కోసం పాటుపడిన గొప్ప నాయకుడని అని కొనియాడారు. జిల్లాలోని మాదిగ యువకులు అందరూ పై చదువులు చదివి ఉద్యోగం సాధించే దశగా అడుగులు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. మాదిగలను చిన్నచూపు చూసిన అగ్రకులాల వ్యక్తులకు మాదిగ కులస్తులందరూ దిక్సూచిగా ఉంటూ వివిధ శాఖల్లో ఉద్యోగాలు సంపాదించి గౌరవప్రదమైన వృత్తిలో ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎం అనోక్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకుడు మిట్ట కందల రామకృష్ణ, రంగస్వామి, వెంకట స్వామి, రాముడు, ఈశ్వరుడు, వెంకటరమణ, శేఖర్, విజయుడు, సురేష్, సామేలు, సంజన, కద్రన్న, రమేష్,రామకృష్ణ, బుజ్జన్న, ఏసన్న, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, ప్రతాప్, బన్నూరు వెంకటేశ్వర్లు, శేషన్న, శంకర్ పాల్గొన్నారు.



# శ్రీ మద్దులేటి స్వామి దేవస్థానంలో శ్రీ స్వామి అమ్మవార్ల కళ్యానోత్సవం.

**బేతంచెర్ల జులై, 10 ( నంది పత్రిక ).** బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామ పొలిమేరలో గల ప్రముఖ వైష్ణవ క్షేత్రం అగు,శ్రీ మద్దులేటి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం నందు కొలువై ఉన్న లక్షలాది భక్తుల ఆరాధ్య దైవం శ్రీ మద్దులేటి స్వామి, శ్రీ మహా లక్ష్మీ అమ్మవార్ల కళ్యానోత్సవంను ఉప కమీషనర్ & శ్రీ మద్దులేటి స్వామి దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఎం. రామాంజనేయులు ఆధ్వర్యంలో వైభవంగా శుక్రవారం నిర్వహించడం జరిగింది. శ్రీ స్వామి అమ్మ వార్లకు పుష్పాలంకరణ చేసి,ఆలయ వేద పండితుల మంత్రోచ్చరణములతో కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. డోన్ పట్టణానికి చెందిన దాతలు, భక్తులు, ఆలయ సిబ్బంది ఈ కళ్యానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# తొట్టిగారిపల్లి పీహెచ్‌సీలో ప్రధాని మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమం గర్భిణీలకు ఉచిత వైద్య పరీక్షలు, అవగాహన

**బద్వేల్, జూలై 10: (నంది పత్రిక):** వైఎస్సార్ కడప జిల్లా, బద్వేల్ మండలంలోని తొట్టిగారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో శుక్రవారం ప్రధాని మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమాన్ని వైద్యాధికారి డాక్టర్ జి. రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బద్వేల్‌లోని సంజీవిని ప్రైవేట్ హాస్పిటల్‌కు చెందిన గైనకాలజిస్ట్ గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలు నిర్వహించి, హై రిస్క్ గర్భిణీలను గుర్తించి తదుపరి చికిత్స కోసం సంబంధిత ఆసుపత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో గర్భిణీలకు 108, 102, 104 అత్యవసర ఆరోగ్య సేవల వినియోగం, ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం, పిల్లల మధ్య తగిన విరామం (బర్త్ స్పేసింగ్), కుటుంబ నియంత్రణ పద్ధతులు, పోషకాహారం యొక్క ప్రాముఖ్యత, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవ సేవల ప్రయోజనాలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శశివర్ధన్ రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె. చంద్రావతి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి. వెంగయ్య, హెల్త్ సూపర్వైజర్ సులోచన, విలేజ్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# ఫ్రైడేని డ్రైడేగా పాటించాలి





### ప్రతి శుక్రవారం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

### ప్రజారోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

### కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** డెంగ్యూ, చికెన్‌గున్యా, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు ప్రతి శుక్రవారం "ఫ్రైడేడ్రైడే" కార్యక్రమాన్ని తప్పనిసరిగా పాటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పెద్దపాడు రస్తాలోని ఇందిరాగాంధీ కాలనీ (బీడి వర్కర్స్ కాలనీ) నందు ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం ఇళ్లలో, కార్యాలయాల్లో, విద్యాసంస్థల్లో, వ్యాపార సంస్థల్లో నీరు నిల్వ ఉండే కూలర్లు, సిమెంట్ తొట్టిలు, డ్రమ్‌లు, బకెట్లు, పూల కుండీలు, ఫ్రిజ్ ట్రేలు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, ఖాళీ డబ్బాలు తదితర వస్తువుల్లో నీటిని పూర్తిగా తొలగించాలని సూచించారు. వారానికి ఒకసారి నీటి నిల్వ పాత్రలను ఖాళీ చేసి, బ్రష్‌తో శుభ్రపరచి తిరిగి ఉపయోగించాలని తెలిపారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలే దోమల ఉత్పత్తికి ప్రధాన కారణమని, ప్రతి శుక్రవారం నాడు వాటిని శుభ్రం చేసి పొడిగా ఉంచడం ద్వారా దోమల వ్యాప్తిని సమర్థవంతంగా అరికట్టవచ్చన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ఇంటి పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా చూడాలని, పాడైపోయిన వస్తువులు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, ఖాళీ డబ్బాలు వంటి వాటిలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమల నివారణ, నగర పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యంతోనే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని, ప్రతి ఒక్కరూ "ఫ్రైడేడ్రైడే" కార్యక్రమాన్ని అలవాటుగా మార్చుకుని ప్రజారోగ్య పరిరక్షణకు తోడ్పడాలని కమిషనర్ చల్లా ఓబులేసు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, సినియర్ ఎంటమాలజిస్ట్ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ వేణుగోపాల్, సానిటరీ ఇంస్పెక్టర్‌లు మల్లికార్జున, అలీమ్ బాష, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ మండల కమిటీ ఏకగ్రీవం..



**చాగలమర్రి జూలై10 నంది పత్రిక** మండల కేంద్రమైన చాగలమర్రిలోని ఆర్.సి.యం స్కూల్ మైదానంలో శుక్రవారం ఏఐటీయూసీ అనుబంధ సంస్థ అయినా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ మండల కమిటీ ని టీచర్లు హెల్పర్స్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ ఏర్పాటు చేయడానికి పరిశీలకులుగా జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షురాలు చంద్రకళ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల కమిటీ ఏర్పాటు చేయడానికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. సంఘ నియమ నిబంధనలు తెలియజేశారు. చాగలమర్రి మండలం అధ్యక్షురాలుగా హసీనా, ఉపాధ్యక్షురాలు హసానమ్మ, వహీదా, ప్రధాన కార్యదర్శి కాకి సుజాత, సహాయ కార్యదర్శి శ్రీలక్ష్మి, కోశాధికారి ఇందుమతి, సభ్యులు మోక్షవతి, మాబుచాన్, ఓబులమ్మ, మై మూన్, తదితరులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. హెల్పర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలుగా మచ్చ గుర్రమ్మ, ఉపాధ్యక్షురాలు జ్యోతి, దీప, కోశాధికారి మా బు చాన్ , సుధారాణి, సభ్యులు పద్మావతి, దిల్షద్, కేజియా, లక్ష్మీదేవి, తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## 1000 కి. మీ మైలురాయి (పైలాన్) సుందరీకరణ పనులు.

### ఎన్టీఆర్ ట్రస్ట్ ఆదేశాల మేరకు చేపట్టిన సుందరీకరణ పనులు.

### పరిశీలించిన టిడిపి సీనియర్ నాయకులు కొంకా ఉమాపతి నాయుడు.



**నంది పత్రిక ఆదోని ప్రతినిధి** ఆదోని నియోజకవర్గంలో యువనేత, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మరియు ప్రస్తుత మంత్రివర్యులు నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన 1000 కిలోమీటర్ల మైలురాయి (పైలాన్) వద్ద చేపట్టిన సుందరీకరణ పనులను స్థానిక నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా పైలాన్ పరిసరాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు, యువగళం పాదయాత్రకు గుర్తుగా ఈ ప్రాంతాన్ని అందంగా అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రజలకు ఈ చారిత్రాత్మక ఘట్టం చిరస్మరణీయంగా నిలిచేలా చర్యలు తీసుకుంటామని ఉమాపతి నాయుడు గారు తెలిపారు.

## కర్నూలులో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల దాడి.

### మొత్తం ఆరుగురు అరెస్ట్

### (ముగ్గురు మహిళలు , ముగ్గురు విటులు)



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముజఫర్‌నగర్ ,ఆదిత్యనగర్‌లలోని ఓ ఇంటిలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో కర్నూలు 4వ పట్టణ పోలీసులు స్థానిక పెద్దల సమక్షంలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో ఆ ఇంటిలో పలువురు వ్యక్తులు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు విచారణ చేపట్టగా, ఆ ఇంటిని అద్దెకు తీసుకుని గుట్టుచప్పుడు కాకుండా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ కార్యకలాపాలకు మరికొందరు సహకరిస్తూ, పరిచయస్తుల ద్వారా వ్యక్తులను అక్కడికి రప్పిస్తున్నట్లు గుర్తించారు. ముగ్గురు మహిళలను, విటులు కర్నూలు బీ. తాండ్రపాడుకు చెందిన మహేశ్వర్, టీ. గోగులపాడుకు చెందిన ఖలీల్, ఒంగోలుకు చెందిన వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ఆరుగురిపై ప్రివేన్షన్ అఫ్ ఇంమోరల్ ట్రాఫిక్ (పిటా ) యాక్ట్ కింద కేసు నమోదు చేసి, రిమాండ్ నిమిత్తం గౌరవ న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు కర్నూలు 4వ పట్టణ పోలీస్ ఇన్‌స్పెక్టర్ విక్రమ్ సింహా తెలిపారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద లేదా అసాంఘిక కార్యకలాపాలు గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## నేర నియంత్రణ, ప్రజల భద్రతే లక్ష్యం

### రాత్రివేళల్లోకొనసాగుతున్న విజిబుల్ పోలీసింగ్ ఏటీఎంల వద్ద గట్టి నిఘా

### రహదారి ప్రమాదాల నివారణకు "స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమం



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నేరాల నియంత్రణకు అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను తనిఖీ చేస్తూ, ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించే చర్యలు చేపడుతున్నారు. కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని సబ్‌డివిజన్ల పరిధిలో పోలీసులు కట్టుదిట్టంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. కర్నూలు నగరంలో కర్నూలు టూ టౌన్ సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో బ్లూ కోల్ట్స్, క్యూఆర్టీ పోలీసు బృందాలు విస్తృత తనిఖీలు చేపట్టాయి. ఏటీఎంల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేశారు. అదేవిధంగా రహదారి ప్రమాదాల నివారణకు "స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్-112 లేదా డయల్-100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## టిడిపి మండల అధ్యక్షుడు శివప్ప పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి



### జేపీసీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తాలూకా సిఐ నల్లప్ప వినతి

**నంది పత్రిక ఆదోని ప్రతినిధి** టిడిపి మండల అధ్యక్షుడు దొడ్డనగిరి శివప్ప పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో తాలూకా సిఐ నల్లప్ప ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ భాష డి.ఎస్.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉదయ్ పిడిఎస్ఓ రాష్ట్ర నాయకులు తిరుమలేష్ , బాలు మాట్లాడుతూ కర్నూలు జిల్లా ఆదోని మండలం దొడ్డనకేరి గ్రామంలో పాఠశాల స్థలాన్ని కబ్జాజేసి బెదిరింపులకు పాల్పడిన మాజీ సర్పంచ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయవలసిందిగా కోరుతున్నాము. దొడ్డనకేరి జడ్.పి.హెచ్. హైస్కూల్ పూర్వ విద్యార్థులు మరియు విద్యార్థి సంఘాలనాయకులుగా దొడ్డనకేరి జడ్.పి.హెచ్. హైస్కూల్ మైదానంలో సుమారు 11సెంట్ల ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైందని తెలిసి, పాఠశాల పరిరక్షణ బాధ్యతతో అక్కడికి వెళ్లి సంబంధిత వివరాలు తెలుసుకున్నాము. గ్రామంలో విద్యార్థులతో కలిసి నిరసన తెలియజేశాము. అనంతరం మా వద్ద ఉన్న ఆధారాలతో 06/07/2026 తేదీ న ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ ద్వారా అధికారికంగా ఫిర్యాదు సమర్పించాము. ఈ విషయంపై మాజీ సర్పంచ్ శివప్ప ప్రెస్ మీట్ నిర్వహించి, పాఠశాల స్థలాన్ని కాపాడేందుకు ధర్నాలు, ర్యాలీలు చేస్తే కొడకల్లారా కాళ్లు చేతులు నరుకుతా అంటు బహిరంగంగా మీడియా ఎదుట మాట్లాడడం జరిగింది. అంతేకాకుండా, మా పాఠశాల పూర్వ విద్యార్థుల ఇండ్లకు వెళ్లి వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ బెదిరింపులకు పాల్పడటం జరిగింది. ఈ చర్యల వల్ల మాలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ప్రభుత్వ పాఠశాల ఆస్తిని పరిరక్షించాలనే ఉద్దేశంతో చట్టబద్ధంగా అధికారులను ఆశ్రయించిన మాపై ఈ విధంగా బెదిరింపులు చేయడం చట్టవిరుద్ధమైన చర్య. మాకుటుంబాలు అన్ని తీవ్ర ఆందోళనకు చెందుతున్నాయి. అందువల్ల ఈ సంఘటనపై మీరు దీని పై స్పందించి మాజీ సర్పంచ్ శివప్ప పై క్రిమినల్ కేసు నమోదు చేసి,

చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జేపీసీ విద్యార్థి సంఘాల నాయకులు తెలియజేశారు. అనంతరం ఈ కార్యక్రమంలో విద్యార్థి జేపీసీ నాయకులు శేఖర్ మోహన్ హరి రఘు వెంకటేష్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి నేరుగా వినతులను స్వీకరించి పరిష్కరించిన కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

**కర్నూల్ సిటీ నంది పత్రిక** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడి ఆదేశాల మేరకు శుక్రవారం కోడుమూరు నియోజక వర్గం శాసనసభ్యులు బొగ్గుల దస్తగిరి నివాసం నందు నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో నియోజకవర్గం నలుమూలల నుంచి విచ్చేసిన వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై ఎమ్మెల్యే ప్రత్యక్షంగా అర్జీలు స్వీకరించారు అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులతో ఫోన్‌లోనే మాట్లాడి కొన్ని సమస్యలకు తక్షణ పరిష్కారం అందించారు. మరికొన్ని సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



## కాల్వబుగ్గ గ్రామంలో ఉన్న ఇటుకల బట్టి ఓనరు "అచ్చు మౌలాలి" పైన తక్షణమే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలి సిపిఐ

**కర్నూల్ సిటీ నంది పత్రిక** ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ గ్రామంలో నిన్న రాత్రి ఒక ఇటుకల బట్టిలో విద్యుత్ తీగలు సరిగా లేక ఆ బట్టీ ఓనర్ అచ్చు మౌలాలి నిర్లక్ష్యం వల్ల వడ్డే వెంకటేశ్వర్లు అనే వ్యక్తి నిన్న రాత్రి ప్రమాదశవత్తు మరణించడం జరిగింది ఇందులో భాగంగా కర్నూలు జిల్లా సిపిఐ పార్టీ సి ఆర్ భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సిపిఐ పార్టీ ఓర్వకల్ మండల కార్యదర్శి "రమేష్ " , సిపిఐ పార్టీ నగర సహాయ కార్యదర్శి "సి .మహేష్ ,మాట్లాడుతూ కాల్వబుగ్గ ఇటికల బట్టిలో సరైన విధంగా విద్యుత్ తీగలు లేకపోవడం వలన ఒక నిండు ప్రాణం పోయిందని ఆవేదన వ్యక్తం చేసి ఆ యొక్క ఇటుకల బట్టి ఓనర్ పైన తక్షణమే కేసు నమోదు చేసి ఆయన అరెస్ట్ చేసి అలాగే వడ్డే వెంకటేశ్వర్లు మరణం తీరని లోటు , ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు కావున" వడ్డే వెంకటేశ్వర్లు" కుటుంబానికి "20 .లక్షలు" నష్ట పరిహారం ఆ ఇటికల బట్టి ఓనరైన "అచ్చు మౌలాలి" చెల్లించాలి అలాగే ఆయనను తక్షణమే అరెస్టు చేయాలని విలేకరులతో మాట్లాడారు , ఈ కార్యక్రమంలో "సిపిఐ పార్టీ , ఏఐవైఎఫ్ "నగర నాయకులు , నాగరాజు భద్ర కుమార్ పాల్గొన్నారు



# రాష్ట్ర అభివృద్ధి మరియు ప్రజలకు సంక్షేమమే ముఖ్యం.

**వైసీపీ పార్టీ డైవర్ట్ రాజకీయన్నీ ప్రజలు నమ్మొద్దండి.**
**ఏపీ స్టేట్ కురుబ కురుమ కార్పొరేషన్ చైర్మన్ మరియు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మాన్వి దేవేంద్రప్ప.**




**నంది పత్రిక ఆదోని ప్రతినిధి** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మన రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బాబు ఎంతో అహర్షనియంగా కష్టపడుతున్నారో రాష్ట్ర ప్రజలు కళ్ళారా చూస్తున్నారు, దేశంలోనే అత్యధిక కంపెనీలు పెట్టుబడి పెట్టడానికి ఆంధ్ర రాష్ట్రాన్ని వెతుక్కుంటూ వస్తున్నాయి అంటే అది మన విజనరీ నాయకుడు చంద్రన్న నాయకత్వ మీద ఉన్న నమ్మకం, రాజకీయ నాయకుడు కాకుండా ఒక బిజినెస్ మ్యాన్ ల పని చేస్తున్నారు, నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా సేవ చేయడానికి ప్రజలు ఎన్నుకున్నారంటే ప్రజలకు చంద్రబాబు నాయుడు నాయకత్వం మీద నమ్మకం, రెండేళ్లలో దేశంలోనే 26 శాతం పెట్టుబడులు ఆంధ్ర రాష్ట్రానికి తీసుకొచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుంది ప్రజల ముందుకు ప్రజల మధ్య మన ప్రభుత్వం చేసిన అభివృద్ధినీ తెలియపరచాలి, రాయలసీమను రతనాలసీమగా తీర్చి దిద్దుతున్నారు మన చంద్రన్న లోకేష్ ఎన్నో కంపెనీలు పెట్టుబడులు పెడుతున్నాయి, కర్నూల్లో డ్రోన్ సిటీ, మడకశిరలో సోలార్ ప్లాంట్, పుట్టపర్తిలో పైలెట్ జట్, కడపలో స్టీల్ ప్లాంట్, చిత్తూరులో రాయల్ ఎన్ఫీల్డ్, ఇలా ఎన్నో కంపెనీలు తెచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు, రాష్ట్ర అభివృద్ధిని ఓర్చుకోలేక వైసీపీ (గొడ్డలి) పార్టీ నాయకులు డైవర్ట్ రాజకీయాలు చేసి ప్రజలను మభ్యపెడుతున్నారు, ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి సంక్షేమము అందిస్తున్నాము, అలాగే ఉద్యోగాలు సృష్టించాలంటే దేశంలోనే నంబర్ వన్ లీడర్ మన చంద్రన్న అని గౌరవ పడుతున్నాము అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, సంవత్సరానికి మూడు వంట సిలిండర్, వృద్ధులకు వితంతులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్, అన్న క్యాంటీన్ ఇలా సంక్షేమంతో పాటు మెగా డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇలా చెప్పుకుంటూ పోతే రాష్ట్రంలో 24 లక్షల కోట్లు పెట్టుబడులు రెండు సంవత్సరశీలో వచ్చినాయి మూడు సంవత్సరంలో ఎంత పెట్టుబడి రావచ్చు ప్రజలకు తెలియజేయాలి, గొడ్డలి పార్టీ నాయకులు మన నాయకులను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారు, మనము ప్రజలతో మమేకమై త్వరలో వచ్చే స్థానిక ఎలక్షన్లో మన కూటమి నాయకులను గెలిపించుకోవాలని తెలిపినారు.

# పోక్సో కేసుల్లో బాధితులకు అండగా 'వన్ స్టాప్ సెంటర్'

**పీడీ పి.విజయ ఆదేశాలతో నిరంతర పర్యవేక్షణ**
**నేరం నిరూపితమయ్యేలా లాయర్ శిల్ప, స్పెషల్ పీపీ శ్రీనివాసులు కృషి**



**నంది పత్రిక కర్నూలు బ్యూరో** మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ పరిధిలోని వన్ స్టాప్ సెంటర్ బాధితుల పక్షాన నిలిచి చట్టపరమైన న్యాయం అందించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ) పి.విజయ గారి ఆదేశాల మేరకు.. జిల్లాలో నమోదయ్యే ప్రతి పోక్సో (గూజూరా), రేప్ కేసులను వన్ స్టాప్ సెంటర్ లాయర్ డి.శిల్ప మొదటి నుండి ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షిస్తున్నారు. ఇందులో భాగంగానే, కోర్టులో రిజిస్టర్ అయిన ఒక పోక్సో కేసు (గూజూరా నాజ. 10/2026) ప్రారంభ దశ నుండి నేడు తుది తీర్పు (జడ్జిమెంట్) వచ్చే వరకు ప్రతి దశలోనూ లాయర్ శిల్ప నిరంతరం ఫాలో అప్ చేస్తూ వచ్చారు. పీడీ విజయ గారి మార్గదర్శకత్వంలో బాధితురాలికి అవసరమైన పూర్తి చట్టపరమైన తోడ్పాటును అందించారు. గౌరవ ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (నాజూశ్రీ. న్రా) శ్రీ సి.వి. శ్రీనివాసులు గారి సహకారంతో, కోర్టులో నిందితుడిపై నేరం నిరూపితమయ్యేలా వన్ స్టాప్ సెంటర్ బృందం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించింది.

**అధికారుల ప్రకటన:** "జిల్లాలో నమోదయ్యే పోక్సో మరియు రేప్ కేసుల్లో నలిగే బాధితులకు డిపార్ట్‌మెంట్ పరంగా పూర్తి న్యాయం జరిగేలా చూడటమే మా ముఖ్య లక్ష్యం. పీడీ గారి ఆదేశాల మేరకు వన్ స్టాప్ సెంటర్ భవిష్యత్తులోనూ ఇదే విధంగా నిరంతరం తన బాధ్యతను కొనసాగిస్తుంది." అని అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ఎన్ఐఏ కేసుల విచారణ కు ప్రత్యేక కోర్టు ఏర్పాటు

**మంత్రివర్గ సమావేశంలో ఆమోదం**
**హైకోర్టులో "రిజిస్ట్రార్" ( కోర్టు కేస్ అండ్ మేనేజ్మెంట్ )పోస్టు సృష్టికి కూడా గ్రీన్ సిగ్నల్**
**న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి**

**అమరావతి, జులై 10. నంది పత్రిక:** జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)చట్టం కింద నమోదయ్యే కేసుల విచారణ కోసం విశాఖపట్నంలో ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించినట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. శుక్రవారం వెలగపూడి సచివాలయం లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో న్యాయ శాఖకు సంబంధించిన రెండు కీలకమైన ప్రతిపాదనలకు ఆమోదం లభించిన విషయాన్ని మంత్రి ఫరూక్ వెల్లడించారు. జాతీయ దర్యాప్తు సంస్థ చట్టం, 2008 కింద నమోదయ్యే కేసులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేందుకు ప్రత్యేక ఎన్ఐఏ కోర్టులను ఏర్పాటు చేయాలని భారత సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలకు ఆదేశించినట్లు ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ (అడ్మినిస్ట్రేషన్) ప్రభుత్వానికి తెలియజేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో విజయవాడ, విశాఖలో ఎన్ఐఏ కేసుల విచారణ కోసం రెండు నోటిఫై చేసిన కోర్టులు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. కాగా రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం 20 ఎన్ఐఏ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 19 కేసులు విశాఖపట్నంలోని 3వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి కోర్టులో, విజయవాడలోని 2వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి కోర్టులో ఒక కేసు పెండింగ్‌లో ఉందన్నారు. విశాఖలో ఎన్ఐఏ కేసుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం పరిధిగా ఉండేలా విశాఖలో జిల్లా మరియు సెషన్స్ జడ్జి స్థాయిలో ఒక ప్రత్యేక ఎన్ఐఏ కోర్టును ఏర్పాటు చేయడం అవసరమని హైకోర్టు అభిప్రాయపడిందన్నారు. విశాఖలో జిల్లా మరియు సెషన్స్ జడ్జి స్థాయిలో ఒక ప్రత్యేక ఎన్ఐఏ కోర్టును ఏర్పాటు చేయడం, ఆ కోర్టుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం పరిధిగా ఉండేలా నిర్ణయించడం, అలాగే దీనిని నిర్వహించడానికి ఒక స్పెషల్ జడ్జితో సహా మొత్తం 16 మంది సిబ్బందిని కేటాయించాలని చేసిన ప్రతిపాదనకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలపడం జరిగిందన్నారు.

హైకోర్టులో "రిజిస్ట్రార్" ( కోర్టు కేస్ అండ్ మేనేజ్మెంట్ )పోస్టు సృష్టికి కూడా గ్రీన్ సిగ్నల్ రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం హైకోర్టులో జిల్లా న్యాయమూర్తి స్థాయికి చెందిన, రెగ్యులర్ ప్రాతిపదికన రిజిస్ట్రార్ ( కోర్టు కేస్ అండ్ మేనేజ్మెంట్ )పోస్టు సృష్టికి కూడా మంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించిందని న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. సుప్రీంకోర్టు సుమోటో రిట్ పిటిషన్ (క్రిమినల్)నెంబర్- 4/2021 లోని ఆదేశాలు, సుప్రీంకోర్టు 'కేస్ ఫ్లో మేనేజ్‌మెంట్ కమిటీ' చేసిన సిఫార్సుల మేరకు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులోని 'స్టేట్ కోర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ కమిటీ'కి చెందిన న్యాయమూర్తులు రాష్ట్ర హైకోర్టులో జిల్లా న్యాయమూర్తి స్థాయికి సమానమైన 'రిజిస్ట్రార్ (కోర్ట్ అండ్ కేస్ మేనేజ్‌మెంట్)' పోస్టును సృష్టించాలని నిర్ణయించిన మేరకు ప్రభుత్వం రిజిస్ట్రార్ పోస్టు సృష్టికి ఆమోదం తెలపడం జరిగిందన్నారు. కొత్త పోస్టు ఏర్పడటం వల్ల జిల్లా న్యాయస్థానాలలో పెండింగ్ కేసులను తగ్గించేదుకు వీలు కలుగుతుందని న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.



# నేడు విజయవాడలో మైనారిటీ యువత కోసం రాష్ట్రస్థాయి మెగా జాబ్ మేళా

**సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చిన మంత్రి ఫరూక్**



**అమరావతి, జులై 10. నంది పత్రిక:** విజయవాడలో నిరుద్యోగ మైనారిటీ యువత కోసం రాష్ట్రస్థాయి మెగా జాబ్ మేళా ను ఈనెల 11వ తేదీ శనివారం నిర్వహిస్తున్నట్లు మైనారిటీ,న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇస్లాం పేట లోని షాజహూర్ ముసాఫిర్ ఖానాలో ఉదయం 9 గంటల నుండి జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. నిరుద్యోగ మైనారిటీ యువత కోసం, ఉద్యోగ, ఉపాధి కల్పనకు ప్రఖ్యాతిగాంచిన 60 నుండి 70 మల్టీ నేషనల్ సంస్థలు, డోమెస్టిక్ కంపెనీలు పాల్గొంటున్నట్లు మంత్రి తెలిపారు. ఐటి , బ్యాంకింగ్ , ఫైనాన్స్, హెల్త్ కేర్,లాజిస్టిక్స్, రిటైల్ తదితర రంగాలలో వివిధ స్థాయిలలో 2500 నుండి 3500 మందికి ఉపాధి అవకాశాలు కల్పించడమే జాబ్ మేళా ముఖ్య ఉద్దేశమని తెలిపారు. 10 వ తరగతి నుండి పీజీ దాకా చదివిన నిరుద్యోగులంతా పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు.

# బాలికలు చిన్నప్పటినుండి క్యాన్సర్ వ్యాధి గురించి అవగాహన కలిగి ఉండాలి





**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం, బ్యూరో చీఫ్ జూలై 10 నంది పత్రిక** పాఠశాలలో బాలికలు చిన్నప్పటినుండి క్యాన్సర్ వ్యాధి గురించి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక పి.ఎస్.ఎమ్ గర్ల్స్ హై స్కూల్ లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మహిళ ల క్యాన్సర్ నివారణ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ బాలికలు చిన్న వయసు నుండి మంచి పౌష్టిక ఆహారం తీసుకుంటూ ఆరోగ్యం గాఉండాలని చెప్పారు. విద్యార్థి దశ నుండి ఆడపిల్లలు చదువుతోపాటు మంచి వ్యాయామలు చేయాలని ఆమె సూచించారు. క్యాన్సర్ గురించి ఎవరు కూడా భయపడనవసరం లేదని చిన్నపాటి అనుమానం ఉన్నట్ల యితే వెంటనే డాక్టర్ ను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించు కోవాలని ఆమె చెప్పారు. ఆడపిల్లలు యుక్త వయసు నుండి జాగ్రత్తలు తీసుకుంటే క్యాన్సర్ క్యాన్సర్ వ్యాధులకు గురికా కుండా ఉండవచ్చు నని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా మహిళలు క్యాన్సర్ -నివారణ అవగాహన గురించి పాఠశాల బాలికలకు డాక్టర్ నీరుకొండ గీతనాగశ్రీ కాన్సర్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణ, జె.వి.వి సమంతా నాయకు రాలు శిరీష జ్యోతి, పాఠశాల ఉపాధ్యా యులు తదితరులు పాల్గొన్నారు.





## నియోజకవర్గ సమస్యలను పరిష్కరించడానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం, బ్యూరో చీఫ్ జూలై 10 నంది పత్రిక** నియోజకవర్గ పరిధిలో ప్రజా సమస్యలను పరిష్కరించడానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదల వాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం భీమవరం నియోజకవర్గం స్థాయిలో వీరవాసరం మండల కేంద్రం తులసి ఫంక్షన్ హాల్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రత్యేక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నాగరాణి,భీమవరం శాసనసభ్యులు పులపర్తి రామాంజనే యులుతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూనియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యలను పరిష్క రించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక ప్రజా సమస్య ల పరిష్కార వేదిక కార్యక్రమాలు నిర్వ హించవలసిందిగా ఆదేశాలు ఇచ్చారని ఆమె చెప్పారు. భీమవరం నియోజక వర్గం వీర వాసం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి వివిధ సమస్యలపై 150 అర్జీలు వచ్చాయని కలెక్టర్ చెప్పారు. నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యలను పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీల ను సంబంధితశాఖల అధికారులకుపంప దంజరుగు తుంద న్నారు. అధికారులు పరిశీలించి నెల రోజుల్లోగా పరిష్క రించడానికి చర్యలు తీసుకోవాలని ఆమె చెప్పారు. ఈ కార్యక్ర మంలో భీమవరం శాసనస భ్యులు పులపర్తి రామాంజ నేయులు, జాయింట్ కలెక్టర్ కె.ఆర్.కల్ప శ్రీ, ఏలూరు జిల్లా పరిషత్ సీఇఓ పి.జగదాంబ, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.పిచ్చయ్య, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ అప్పారావు, నియోజ కవర్గ ప్రత్యేక అధికారి కే.అప్పారావు, భీమవరం రెవెన్యూ డివిజన్ అధికారి ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసిల్దార్ కనకదుర్గ, ఎంపీడీఓ వైభావతి తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు 15వేలు మారుతి నాయుడు ఆర్థిక సాయం

**మారుతి నాయుడు ను ఘనంగా సన్మానించిన నెట్టేకల్ ఎస్సీ యువకులు**



**నంది పత్రిక ఆదోని ప్రతినిధి** ఆదోని మండల పరిధిలోని నెట్టేకల్ గ్రామంలో నూతనంగా అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు ఎస్సీ యువత నాయకుల ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో టిడిపి యువ నాయకులు మారుతి నాయుడు అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు తన వంతు సహాయంగా 15వేలు ఆర్థిక సహాయం ఇవ్వడం జరిగింది. శుక్రవారం సాయంత్రం మారుతి నాయుడు కార్యాలయంలో యువకులంతా కలిసి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా మారుతి నాయుడుకు ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రభాకర్,రాముడు జీవరత్న, ఆనంద్, ప్రభు, ఖాదర్ ఆధ్వర్యంలో పూల మాలలు వేసి శాలువా తో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా మారుతి నాయుడు మాట్లాడుతూ అంబేద్కర్ అందరికీ విధేయుడే అని, అంబేద్కర్ ఆశయాల్లో ప్రతి ఒక్కరు నడవాలని ఆయన యువతకు సూచించారు. నెట్టేకల్ టిడిపి సీనియర్ నాయకులు మహేష్ యాదవ్ అంబేద్కర్ విగ్రహానికి సాయం చేయాలని తెలపడంతోనే తాను తన వంతుగా ఈ సహాయం అందించానని తెలిపారు. నెట్టేకల్ గ్రామ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నర్సన్న, ఉసెని, బాలు, నాగరాజు, చిన్న నర్సప్ప యేసు రాజు పాల్గొన్నారు.

# తెలంగాణ జనసేనలో కొత్త జోష్.. పవన్ సమక్షంలో పార్టీలోకి భారీగా చేరికలు

తెలంగాణలో పార్టీ బలోపేతం దిశగా జనసేన పార్టీ కీలక అడుగులు వేస్తోంది. శుక్రవారం హైదరాబాద్‌లో రాజకీయ, విద్య, కార్మిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు జనసేన పార్టీలో చేరారు. పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

జనసేనలో చేరిన వారిలో తెలంగాణ యూనివర్సిటీ మాజీ వైస్-ఛాన్సలర్, ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ ప్రొఫెసర్ డి. రవీందర్ ముఖ్యులు. వీరితో పాటు ప్రజారాజ్యం పార్టీ మాజీ నేత, నిజామాబాద్‌కు చెందిన మీసాల శ్రీనివాస్ రావు, ట్రేడ్ యూనియన్ నేత దేవరకొండ రామ్మోహన్ రావు, హైకోర్టు న్యాయవాది మైదంశెట్టి రవివర్మ, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు బి. రవీందర్ గౌడ్ తదితరులు పార్టీలో చేరారు.

# శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**రాజీ ద్వారా కేసుల పరిష్కారంతో సమయం, డబ్బు ఆదా మానవ సంబంధాల బలోపేతం**

**ఇంచార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, మొదటి అదనపు జిల్లా జడ్జి కె. సునీత**



**మచిలీపట్నం బ్యూరో చీఫ్: జూలై 10 నంది పత్రిక** జాతీయ న్యాయసేవా అధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ జి. గోపి ఆదేశానుసారం కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జూలై 11న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఇంచార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, మొదటి అదనపు జిల్లా జడ్జి కె. సునీత, తెలిపారు. శుక్రవారం సాయంత్రం మచిలీపట్నంలోని జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆమె, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. వరలక్ష్మితో కలిసి జాతీయ లోక్ అదాలత్ నిర్వహణకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఇంచార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. సునీత మాట్లాడుతూ, ఈ ఏడాదిలో నిర్వహిస్తున్న రెండో జాతీయ లోక్ అదాలత్ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలతో పాటు ఏలూరు జిల్లాలోని నూజివీడు, కైకలూరు కోర్టుల పరిధిలో నిర్వహించబడుతుందని తెలిపారు. రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద పరిహార క్లెయిమ్ కేసులు, ట్రాఫిక్ చలానా కేసులు, అన్ని రకాల సివిల్ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. మచిలీపట్నం, విజయవాడ, గుడివాడ, నూజివీడు, నందిగామ, అవనిగడ్డ, కైకలూరు, గన్నవరం, తిరువూరు, చల్లపల్లి, పమిడిముక్కల, మైలవరం, ఉయ్యూరు, మొవ్వ కోర్టుల ఆవరణలో మొత్తం 45 బెంచీలు ఏర్పాటు చేసినట్లు, వాటిలో మచిలీపట్నంలోనే ఐదు బెంచీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత మార్చి 14న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1,09,388 కేసులు పరిష్కారమయ్యాయని, ఈసారి అంతకంటే ఎక్కువ కేసులను పరిష్కరించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు రాజీ చేసుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని, పరస్పర అవగాహన పెరిగి మానవ సంబంధాలు బలోపేతం అవుతాయని, అర్హత ఉన్న కేసుల్లో కోర్టు ఫీజు కూడా తిరిగి చెల్లించబడుతుందని పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. వరలక్ష్మి మాట్లాడుతూ, లోక్ అదాలత్ అనేది కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదని, ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించే సమర్థవంతమైన ప్రత్యామ్నాయ వివాద పరిష్కార వేదిక అని అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసులు, న్యాయవాదులు, బీమా సంస్థలు, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తదితర శాఖల ప్రతినిధులతో పలుమార్లు సమన్వయ సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, కుటుంబ వివాదాలు, ఇతర సివిల్ స్వభావం గల కేసులతో పాటు కోర్టులో దాఖలు కాకముందే రాజీ ద్వారా పరిష్కరించుకునే ప్రీ-లిటిగేషన్ కేసులను కూడా ఈ జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించే అవకాశం కల్పించినట్లు వివరించారు. రాజీ పడదగ్గ కేసులకు సంబంధించిన కక్షిదారులందరూ ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో 'సమాధాన్ సమరోహ్' ప్రత్యేక లోక్ అదాలత్. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. వరలక్ష్మి మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో 'సమాధాన్ సమరోహ్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకునేందుకు పక్షిదారులకు ఈ కార్యక్రమం ద్వారా అరుదైన అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 21, 22, 23 తేదీల్లో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అంతకుముందు జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో ప్రీ-లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహించి, సంబంధిత పక్షిదారులను పిలిపించి రాజీ అవకాశాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగ్గ కేసులకు సంబంధించిన పక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పరస్పర అంగీకారంతో తమ వివాదాలను పరిష్కరించుకోవాలని ఎస్. వరలక్ష్మి విజ్ఞప్తి చేశారు.

# ఎత్తిపోతల పంచాయితీ !

కాళేశ్వరంపై దాగుడు మూతలు కొనసాగుతున్నాయి. ఎవరిది నిజం అన్నది తేలడం లేదు. అధికార కాంగ్రెస్ కాళేశ్వరం పనికిరాదని, నీరు ఎత్తిపోయడానికి లేదని చెబుతోంది. చెరువులు కుంటలు నింపాలంటే ఎత్తిపోయాల్సిందే అని విపక్ష బిఆర్ఎస్ వాదిస్తోంది. సందట్లో సడేమియ్యాలా బిజెపి గోడవాటం వాదనలు చేస్తోంది. ఇందులో ఎవరు నిజం..ఎవరు అబద్ధం అన్నది తేలాల్సి ఉంది. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తి పోయడంలో ఉన్న ఇబ్బందులు, కష్టనష్టాలను నిపుణుల కమిటీ తేల్చాల్సి ఉంది. ఎందుకంటే ఎల్‌నినో ప్రభావంతో వర్షాల జాడ లేకుండా పోయింది. జలాశయాలు వట్టిపోయాయి. ఎస్సారెస్పీ సహా గోదావరి బేసిన్‌లోని ప్రతి జలాశయం ఇప్పటికే డెడ్‌స్టోరేజీకి చేరుకున్నాయి. వానలు కురిసే అవకాశమూ తక్కువగానే ఉన్నది. ఎగువ నుంచి వరద వచ్చే ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఈ క్రమంలో కన్నెపల్లిలో పంప్‌లను ఆన్ చేసి నీటిని లిఫ్ట్ చేస్తే తద్వారా ఎల్లంపల్లి సహా మధ్యమానేరు, దిగువ మానేరు, అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మసాగర్, మల్కపేట తదితర రిజర్వాయర్లను నింపుకోవచ్చని బిఆర్ఎస్ వాదిస్తోంది. అదే విధంగా దేవాదుల నుంచి కూడా నీటిని ఎత్తిపోసుకొనే అవకాశమున్నా రేవంత్ సర్కార్ నీటిని లిఫ్ట్ చేయడం లేదని కూడా హరీస్ రావు అన్నారు. కేవలం ఎన్డీఎస్ఏ నివేదికలను సాకుగా చూపుతూ ప్రాణహిత జలాలను ఒడిసిపట్టకుండా దిగువకు వదిలిపెడుతున్నట్లు ఆరోపిస్తున్నారు.. కేవలం ఏపీలోని కృష్ణా డెల్టా కోసమే రేవంత్ సర్కార్ తెలంగాణ ప్రాజెక్టులను పడావు పెడుతున్నారని ఆరోపించారు కూడా. అయితే ఇందులో నిజమెంత అన్నది తేలాల్సి ఉంది. దీనిని ఎవరు తేల్చాలన్నది ప్రజలకు తెలియదు. ప్రస్తుతం సర్కార్ వ్యవహరిస్తున్న తీరు సైతం అందుకు బలాన్ని చేకూర్చుతున్నది. ఎల్ నినో సంక్షోభం నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే కన్నెపల్లి, అన్నారం, సుందిళ్ల పంపింగ్ స్టేషన్ల నుంచి నీటిని ఎత్తిపోసే చర్యలు చేపట్టి, తద్వారా పంటలు.. రైతుల ప్రయోజనాలను కాపాడాలని తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం డిమాండ్ చేసింది. బరాజ్‌ల్లో మినిమమ్ డ్రా డౌన్ లెవల్ మేరకు జలాలను నిల్వ చేయవచ్చని, తద్వారా ఎలాంటి నష్టం వాటిల్లే అవకాశం లేదని స్పష్టంచేసింది. అదీగాక ఎస్సారెస్పీ ఎగువన, దిగువన ఎల్లంపల్లి, సుందిళ్ల, అన్నారం వరకు వరదనే లేకుండా పోయింది. కానీ మేడిగడ్డ బరాజ్ వద్ద ప్రాణహిత నుంచి ప్రవాహం కొనసాగుతున్నది. మరోవైపు కన్నెపల్లి పంప్‌హౌస్‌లోని మోటర్ల ద్వారా రోజుకు 2 టీఎంసీలను ఎత్తిపోసుకొనే సామర్థ్యమున్నది. మరోవైపు ఏపీ ప్రభుత్వం ఎల్ నినో నేపథ్యంలో అప్పుడే ఎత్తిపోతలను ప్రారంభించింది. గోదావరిలో వస్తున్న వరదను ఉపయోగించుకుని కృష్ణా డెల్టాకు మళ్లిస్తున్నది. పోలవరం డ్యామ్ పూర్తయ్యే వరకు కుడికాలువ ద్వారా గోదావరి జలాలను తరలించేందుకుని ఏలూరు జిల్లాలో పట్టిసీమ లిఫ్ట్ స్కీమ్‌ను ఏపీ గతంలోనే చేపట్టింది. రోజుకు 8,500 క్యూసెక్కుల జలాలను గోదావరి నుంచి లిఫ్ట్ చేసి కుడికాలువ ద్వారా కృష్ణా డెల్టా ఆయకట్టుకు 80 టీఎంసీల మేరకు సాగునీటిని అందించడం ప్రధాన లక్ష్యం. అదేవిధంగా పోలవరం కుడికాలువకు సమాంతరంగా తాడిపూడి కెనాల్‌ను సైతం ఎపి నిర్మించింది. తాడిపూడి లిఫ్ట్ ద్వారా ఇక్కడా 1,400 క్యూసెక్కులను తరలించే ఏర్పాట్లు చేసింది. ఈ రెండు కాలువల ద్వారా గోదావరి జలాలను మళ్లిస్తున్నది. ప్రస్తుతం సూపర్ ఎల్ నినో నేపథ్యంలో పొరుగున ఏపీ ప్రభుత్వం పట్టిసీమ, తాడిపూడి లిఫ్ట్‌లను ప్రారంభించింది. సామర్థ్యం మేరకు గోదావరి జలాలను ఎత్తి పోసేందుకు సిద్ధమైంది. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో వర్షాలు పడటం లేదని, మరోవైపు కేంద్ర జలసంఘం తాజా నివేదిక ప్రకారం రాష్ట్రంలోని పెద్ద ప్రాజెక్టులు, జలాశయాల్లో నీటి నిల్వలు సాధారణ స్థాయి కంటే సుమారు 16-46 శాతం తకువగా ఉన్నాయని వివరించారు. అదే సమయంలో రాష్ట్రంలో ప్రాణహిత నది మాత్రమే ఎల్లప్పుడూ ప్రవహించే నది. రాష్ట్రంలో నీరు లేని పరిస్థితిలోనూ ప్రాణహిత-గోదావరిలో వినియోగయోగ్య మైన వరద ప్రవాహాలు ఇప్పటికీ అందుబాటులో ఉన్నాయని పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో, మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల ఈ మూడు లిఫ్టుల వ్యవస్థను సురక్షితంగా తిరిగి వినియోగించు కోవడం అత్యంత సమంజసమని అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ప్రాణహితలో వరద నీటిమట్టం మేడిగడ్డ ఎండీడీఎల్ కంటే ఎత్తుగా కొనసాగుతున్నంతకాలం, మేడిగడ్డ నుంచి కన్నెపల్లి పంప్‌స్టేషన్ నీటిని లిఫ్ట్ చేసి, అన్నారం, సుందిల్ల బరాజ్‌లను ఎండీడీఎల్ స్థాయిల వద్దే కొనసాగిస్తూ, నీటిని ఎల్లంపల్లి వరకు తరలించ వచ్చని, అది హైడ్రాలిక్‌పరంగా స్థిరమైన, నమ్మకమైన విధానమని విశ్రాంత ఇంజనీర్లు స్పష్టంచేశారు.

గత వరద అనుభవాల ప్రకారం, సాంకేతిక నియమాలకు లోబడి, జాగ్రత్తతో, సురక్షిత పద్ధతుల్లో లిఫ్టులను నడిపితే గ్రామాల ముంపు, ఆస్తి నష్టం, ప్రాణనష్టం వంటి ప్రమాదాలు లేకుండానే నీటి పంపింగ్ వ్యవస్థను సఫలీకృతంగా వినియోగించుకోవచ్చని విశ్రాంత ఇంజినీర్లు చెబుతున్నారు.

అంతిమంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఎల్ నినో సంక్షోభం నేపథ్యంలో పంటలు, రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా గోదావరిలో వచ్చే వరదనీటిని కాపాడుకోవాలి. అది ఎలా చేస్తారన్నది ఆలోచన చేయాలి. ప్రస్తుత దుర్భర పరిస్థితుల్లో సాగు,తాగునీటి అవసరాల కోసం అత్యసవర కార్యాచరణ సిద్ధం చేయాలి.

అదికూడా యుద్ధప్రాతిపదిక సాగాలి. అప్పుడే మనకు నీటి కష్టాలు తీరుతాయి. పదేపదే విమర్శలతో కాలయాపన చేయడం కూడా మంచిది కాదు. ప్రజల, రైతుల ప్రయోజనం దృష్ట్యా కార్యరంగం లోకి దిగాల్సి ఉంది.

# కన్నెపల్లి పంపు హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయాలి

**ప్రాణహితలో నీళ్లు పారుతున్న కనిపించడం లేదా**

**ఎపికి సాయం చేసేందుకే రేవంత్ మిన్నకున్నారు**

**యాదాద్రి కలెక్టరేట్ ఎదుట బిఆర్ఎస్ మహాధర్నా**

కన్నెపల్లి పంపు హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ పార్టీ మహాధర్నా చేపట్టింద. జిల్లా వ్యాప్తంగా భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ అసమర్థ పాలన వల్లే రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. తక్షణమే నీటిని ఎత్తిపోసి రైతులను ఆదుకోవాలన్నారు. నిరసన కార్యక్రమలో మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి, బూడిద బిక్షమయ్య గౌడ్,జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి,రాష్ట్ర నాయకులు, చింతల వెంకటేశ్వర్లు, క్యామ మల్లేష్, కల్లూరి రామచంద్రారెడ్డి, ఎలిమినేటి సందీప్ రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కన్నెపల్లి నుంచి

93.5మీటర్ల నుంచి నీటిని ఎత్తిపోసుకొనే అవకాశమున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రాణహిత జలాలను ఎత్తిపోయకుండా దిగువకు వదిలిపెడుతున్నదని మండిపడ్డారు. సీజన్ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు సుమారు 50టీఎంసీల జలాలను దిగువకు తరలిపోయినట్టు గణాంకాలే వెల్లడిస్తున్నాయన్నారు. ఇలాంటి సమయంలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఈ మూడు లిఫ్టుల వ్యవస్థను సురక్షితంగా తిరిగి వినియోగించుకోవడమే అత్యంత ముఖ్యమని వారు అన్నారు. ఎత్తిపోయడానికి నీళ్లే లేవంటూ సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన గంటల్లోనే దిగువన.. పట్టిసీమ, తాడిపూడి పంపులను ఏపీ సర్కార్ ఆన్ చేసినా గుర్తించడం లేదా అని అన్నారు.

తెలంగాణలో వానల్లేక పంటలు ఎండుతున్నా, మేడిగడ్డలో ప్రాణహిత వరద పారుతున్నా గోదావరి జలాలను ఎత్తిపోయడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతులురావడం లేదన్నారు. కానీ, అందివచ్చిన అవకాశంగా చంద్రబాబు సర్కార్ మాత్రం నీటిని లిఫ్ట్ చేయడం ప్రారంభించింది. ఆంధ్రాకు నీళ్లు పారించేందుకే ఇలా చేస్తున్నారన్న అనుమానాలు ఉన్నాయని అన్నారు. పట్టిసీమకు గోదావరిని పంపేందుకే ఇక్కడ పట్టించుకోవడం లేదా అని నిలదీసారు. రేవంత్ సర్కార్ తీరుతో ప్రాణహిత జలాలు తెలంగాణకు కాకుండా పోతున్నాయి. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయకుండా దిగువకు వదిలిపెడుతున్నది. మొత్తంగా ఏపీ కోసమే రేవంత్ సర్కార్.. కన్నెపల్లి పంపులను ఆన్‌చేయడం లేదని వారు ఆరోపించారు.

# మరోమారు అధికార కోసం జగన్‌కు ఛాన్స్ లేదు

వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మావిగన్‌పై కేంద్రమాజీ మంత్రి చింతా మోహన్ కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. మావిగన్ అంటే మామిడి పండు అని అనుకుంటున్నారని జగన్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. వచ్చే ఎన్నికల్లో ఇదే అంశంపై జగన్ వెళ్తారంటే అయ్యే పనికాదన్నారు. ఒకే ఒక్క ఛాన్స్ అని జగన్ అడిగితే ప్రజలు ఇచ్చారని.. ఇక ఆయనకు ఎటువంటి ఛాన్స్ ఇవ్వరని వ్యాఖ్యానించారు. జగన్ పరిస్థితి అధ్వాన్నంగా ఉందని.. ఏదో ఊహించుకొని మాట్లాడుతున్నారని అన్నారు. జగన్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు 11 ఉన్నాయని.. ఎన్నికల ముందు జైలుకు వెళ్తారా? లేదా? అనేది ముందు తెలుసుకోవాలని కేంద్రమాజీ మంత్రి హితవుపలికారు. జయలలితకు ఒక న్యాయం? జగన్‌కు ఒక న్యాయమా? అని ప్రశ్నించారు. 'జగన్ మావిగన్ అంటే నేను తిరుపతి అంటాను..

## శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో “నెక్స్ట్ జనరేషన్ ఏఐ టెక్నాలజీస్“ పై వెబినార్




**నంద్యాల, జూలై 10. నంది పత్రిక:** శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల (స్వయంప్రతిపత్తి), నంద్యాల లోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ & మెషిన్ లెర్నింగ్) విభాగం, స్టూడెంట్ బ్రాంచ్ మరియు ఎడ్యుకేషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నెక్స్ట్ జనరేషన్ ఏఐ టెక్నాలజీస్“ పై వెబినార్ అంశంపై ఒక రోజు వెబినార్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కృపాజల్ ఇంజినీరింగ్ కళాశాల, భువనేశ్వర్ (ఒడిశా) ప్రిన్సిపాల్ డా. సుభేందు కుమార్ పాణి ముఖ్య వక్తగా హాజరై, జెనరేటివ్ ఏజెంటిక్ సిస్టమ్స్, ఇండస్ట్రీ 5.0, భవిష్యత్ ఉద్యోగ అవకాశాలు, పరిశ్రమల్లో కృత్రిమ మేధస్సు వినియోగం, పరిశోధనలో ప్రాధాన్యత వంటి అంశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. వి. సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై విద్యార్థులు నిరంతరం అవగాహన పెంపొందించుకుని పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. విభాగాధిపతి డా. జె. దేవిడ్ సుకీర్తి కుమార్ మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు ఆధారిత సాంకేతికతలు భవిష్యత్ ప్రపంచాన్ని తీర్చిదిద్దనున్నాయని, విద్యార్థులు పరిశోధన, ఆవిష్కరణలు మరియు నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని అన్నారు. ఇలాంటి సాంకేతిక కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీమతి జి. శిరీష సమన్వయకర్తగా వ్యవహరించారు. కళాశాల అధ్యాపకులు,సభ్యులు మరియు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 3000 నోట్‌బుక్స్ పంపిణీ

**పూల బొకేలకు బదులుగా విద్యార్థులకు ఉపయోగపడే నోట్‌బుక్స్ అందించాలన్న ఎంపీ సానా సతీష్ బాబు పిలుపుకు విశేష స్పందన**



**కాకినాడ బ్యూరో చీఫ్** రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ఇటీవల నగరానికి వచ్చిన సందర్భంగా, తనను మర్యాదపూర్వకంగా కలిసేందుకు వచ్చే నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూల బొకేలు తీసుకురావడం కంటే,పేద విద్యార్థులకు ఉపయోగపడే విధంగా నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్స్ తీసుకురావాలని చేసిన పిలుపుకు విశేష స్పందన లభించింది. ఈసందర్భంగా దాదాపు 3000 నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్స్‌ను మరియు ఎగ్జామ్స్ ప్యాడ్స్ సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు పట్టణంలోని ప్రజావిద్యాలయం,ఎంపీపీఎస్ ప్రైమరీ మోడల్ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కార్యాలయ ప్రతినిధులు, ఫౌండేషన్ సభ్యులు విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేసి వారి విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, పూల బొకేలు కొన్ని క్షణాల ఆనందాన్ని ఇస్తే, ఒక నోట్‌బుక్ విద్యార్థి భవిష్యత్తుకు పునాది వేస్తుందనే ఆలోచనతోఎంపీ సానా సతీష్ బాబు ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. సమాజానికి ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలకు ప్రజలు, నాయకులు, అభిమానులు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. విద్య, ఆరోగ్యం, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి మరింత చేరువ కావడమే సానా సతీష్ బాబు ఫౌండేషన్‌లి లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సానా సతీష్ బాబు ఫౌండేషన్ తలాటం హరీష్‌లి ఎంపీ కార్యాలయ ఇంఛార్జ్ మేకా లక్షణమూర్తి, ఆనంద్ న్యూటన్ , ఫౌండేషన్ సభ్యులు ముమ్మిడి వెంకటేశ్వర రావు, ఎంపీ వ్యక్తిగత సహాయకులు (పీఏ) గౌరీశంకర్,పాల్గొన్నారు.

## ఒకే కాన్పులో నలుగురు పిల్లల జననం

**తల్లీ బిడ్డలు క్షేమంగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాల వెల్లడి**

రాజస్థాన్ లోని ఝులావర్ లో ఒక అరుదైన ఘటన చోటుచేసుకుంది. 25 ఏళ్ల ఓ మహిళ ఒకే ప్రసవంలో నలుగురు శిశువులకు జన్మనిచ్చింది. వారిలో ముగ్గురు ఆడపిల్లలు, ఒక మగబిడ్డ ఉన్నారు. శిశువులు నెలలు నిండకుండానే జన్మించడం, బరువు కూడా తక్కువగా ఉండటంతో వారిని ప్రస్తుతం నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ లో ఉంచి వైద్యులు ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. ఝులావర్ నగరంలోని భోయ్ మొహల్లా నివాసితులైన జ్యోతి కశ్యప్ (25), అరుణ్ కశ్యప్ దంపతులకు ఇప్పటికే ఒక సంతానం ఉంది. రెండో ప్రసవం కోసం ఆమె స్థానిక ప్రభుత్వ హీరా కున్వర్ బా మహిళా ఆసుపత్రిలో చేరారు. బుధవారం ఉదయం వైద్యులు ఆమెకు సిజేరియన్ నిర్వహించగా నలుగురు శిశువులు జన్మించారు. సుమారు 29 వారాలకే ప్రసవం జరగడంతో శిశువులు కేవలం 1.1 కిలోల నుంచి 1.2 కిలోల బరువు మాత్రమే ఉన్నారు. సాధారణంగా పూర్తి నెలలు నిండిన శిశువులు 2.5 కిలోల బరువు ఉంటారని, అయితే ఈ శిశువుల ఊపిరితిత్తులు పూర్తిగా అభివృద్ధి చెందకపోవడంతో వారికి శ్వాస అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వైద్యులు వెల్లడించారు. తన వృత్తి జీవితంలో ఒకే ప్రసవంలో నలుగురు శిశువులు జన్మించడం చూడటం ఇదే మొదటిసారని డాక్టర్ విశాల్ పేర్కొన్నారు. సాధారణంగా ప్రతి 24,000 ప్రసవాల్లో ఒకరికి మాత్రమే ఇలా జరిగే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం తల్లి జ్యోతి ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆమెను గైనకాలజీ వార్డుకు తరలించినట్లు వైద్యులు తెలిపారు. శిశువుల్లో ఒకరి ఆరోగ్యం స్వల్పంగా మెరుగుపడగా మిగిలిన ముగ్గురి పరిస్థితి నిలకడగా ఉందని పేర్కొన్నారు. ఈ పరిణామంపై తండ్రి అరుణ్ కశ్యప్ హర్షం వ్యక్తంచేశారు. తాను ఒక కుమార్తె పుడుతుందని ఆశించాను. కానీ దేవుడు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడిని ప్రసాదించాడు. దైవ నిర్ణయం ఏదైనా తమకు సంతోషమేనని ఆయన పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాద ఘటనలో మరో ఇద్దరు కూలీల మృతి

వేములవాడ మండలం అనుపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో ఇద్దరు మృతిచెందారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అర్చన, రంజీ ప్రభాకర్ అనే ఇద్దరు కూలీలు మరణించారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య మూడుకు చేరింది. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా పూణెళి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు ఉపాధి కోసం ఇటీవల తెలంగాణకు వచ్చారు. కరీంనగర్ జిల్లా బోయినపల్లి మండలంలోని జెగ్గారావుపల్లె వద్ద కొదురుపాకకు చెందిన కాంట్రాక్టర్ ద్వారా ఇక్కడ వరినాట్లకు కూలీలుగా వెళ్తున్నారు. ఈ క్రమంలోనే గురువారం నాడు తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌లో వరి నాట్లు వేసేందుకు 17 మంది మహిళలు, ఆరుగురు పురుషులు వెళ్లారు. నాట్లు ముగించుకుని సాయంత్రం డ్రైవర్‌తో సహా మొత్తం 24 మంది టాటా ఏస్ వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. వారు అనుపురం వద్దకు చేరుకోగానే వెనుక నుంచి ఆర్టీసీ అ÷-దదె వాహనం ఢీకొట్టింది. దీంతో ఆటో దాదాపు పది అడుగుల దూరంలోకి ఎగిరిపడి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న వాసుదేవ్ (35) కూలీ అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్‌తో పాటు 23 మందదికి తీవ్ర గాయాలయ్యాయయి. వారిని హుటాహుటిన వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఇందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉండగా.. అర్చన, రంజీ ప్రభాకర్ అనే ఇద్దరిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు.

# డిస్నీల్యాండ్ హైస్కూల్లో నమూనా ఎన్నికలు








హనుమకొండ జిల్లా దామర మండలం ఓగ్లాలాపూర్ లోని డిస్నీల్యాండ్ హైస్కూల్లో నమూనా ఎన్నికలు నిర్వహించారు. శుక్రవారం డిస్నీల్యాండ్ విద్యాలయంలో ఎంతో హట్టహాసంగా విద్యా క్యాలెండర్ లో భాగంగా విద్యార్థులకు నమూనా ఎన్నికలను పాఠశాల యాజమాన్యం సలహా మేరకు సోషల్ స్టడీస్ ఉపాధ్యాయ బృందం నిర్వహించింది. ఈ ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటిస్తూ నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు, మరియు ఉపాధ్యాయులు సుమారు 850 మంది తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో మంచి క్రమశిక్షణతో బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని ప్రతిన బూనారు. ఈ ఎన్నికలలో బాలికల విభాగం లో స్కూల్ పుపిల్ లీడర్ గా బుద్దె శ్రీహర్ష తన సమీప అభ్యర్థి మూడు కీర్తన పై 80 ఓట్ల తేడాతో, బాలుర విభాగంలో తొర్రూర్ హేమంత్ పదవ తరగతి తన సమీప ప్రత్యర్థి దాసరి చరణ్ కుమార్ పై కేవలం మూడు ఓట్ల తేడాతో విజయాన్ని సాధించాడు. అలాగే డిప్యూటీ స్కూల్ పుపిల్ లీడర్ గా బాలుర విభాగం లో అజ్మీర సిద్దార్థ 9వ తరగతి తన సమీప అభ్యర్థి కావటి సాయి తేజ పై 147 ఓట్ల ఆదిక్యతతో గెలుపొందాడు. బాలికల విభాగంలో అలుగోజు అద్విత 9వ తరగతి తన సమీప అభ్యర్థి తెప్పల శాన్వి పై 24 ఓట్ల తేడాతో విజయాన్ని సాధించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు దయ్యాల మల్లయ్య, దయ్యాల సదయ్య, బాలుగు లక్ష్మీనివాసం, కరస్పాండెంట్ బి.శోభారాణి, డైరెక్టర్లు డి.రాకేష్ భాను, డి. దినేష్ చందర్, డాక్టర్ బి.పవన్,టీజీబీ బ్యాంక్ మేనేజర్ భానుచందర్, కావ్య, మీనా గార్లు ఆద్యంతం ఈ నమూనా ఎన్నికలను పరిశీలించారు.

# డీఎంహెచ్‌వో బదిలీపై ఉద్యోగ సంఘాల హర్షం




హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) ఎస్.బి. రామ్‌కుమార్ బదిలీపై జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. ఉద్యోగుల పట్ల అనుచితంగా ప్రవర్తించడం, వ్యక్తిగత దూషణలకు పాల్పడడం వల్ల వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు, ముఖ్యంగా మహిళా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ తెలిపారు. టీన్‌జీవో, టీజీవో సంఘాలు, ప్రభుత్వ వైద్యుల సంఘాలు, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, ఎస్సీ, ఎస్టీ సంఘాలు, ఆశా ఉద్యోగులు, వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగ సంఘాలు కలిసి డీఎంహెచ్‌వో వ్యవహారశైలిని జిల్లా అధికారుల దృష్టికి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ అంశం తీవ్రతను గుర్తించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రితో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని కోరగా, ప్రభుత్వం విచారణ అనంతరం డీఎంహెచ్‌వోను జిల్లా నుంచి బదిలీ చేసినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో చొరవ చూపిన ఎమ్మెల్యేకు జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆకుల రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు పరస్పర గౌరవం, సానుకూల వాతావరణంలో విధులు నిర్వహించే పరిస్థితులు ఉండాలని అన్నారు. అధికారులు ఉద్యోగులను వేధింపులకు గురి చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు, క్రింది స్థాయి సిబ్బందిపై వేధింపులు జరిగితే ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగుల సంక్షేమం, సమస్యల పరిష్కారంలో టీఎన్‌జీవో యూనియన్ ఎల్లప్పుడూ ముందుంటుందని, విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను సంఘం దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటామని ఆకుల రాజేందర్ తెలిపారు.




# భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఇంచార్జిగా డా. మడికొండ శ్రీను

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఎస్సీ సెల్‌ను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే లక్ష్యంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్సీ సెల్ ఇంచార్జిగా డాక్టర్ మడికొండ శ్రీనును నియమించారు. ఈ సందర్భంగా తనకు బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఏఐసీసీ ఎస్సీ సెల్ జాతీయ కో-ఆర్డినేటర్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్థాయి నుంచి ఎస్సీ సెల్ కమిటీలను బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని డాక్టర్ మడికొండ శ్రీను పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర



సత్యనారాయణ రావు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఇనగాల వెంకట్రాంరెడ్డి, బట్టు కరుణాకర్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మటి సాంబయ్య, ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు, టీపీసీసీ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చైర్మన్ దబ్బేట రమేష్ తదితరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు



కరుణాకర్, మాజీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ దండు రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్‌లను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు స్వీకరించారు. జిల్లాలోని మండల, పట్టణ ఎస్సీ సెల్ కమిటీల ఏర్పాటు, పార్టీ బలోపేతంపై వారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ రాష్ట్ర చైర్మన్ దబ్బేట రమేష్, కార్యదర్శి పుల్యాల గాంధీ, నాయకులు అల్లూరి నరేష్, ఆకునూరి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# వరి నారు తో బీజేపీపై అభిమానం చాటిన సర్పంచ్

భీమదేవరపల్లి మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి వినూత్నంగా బీజేపీపై ఉన్న అభిమానాన్ని అయన చాటుకున్నారు. వరి నాట్లు వేస్తున్న తన పొలంలో వరి మొక్కలతో "బీజేపీ " అనే అక్షరాలను అమర్చి ప్రత్యేక ఆకృతిని రూపొందించారు. రైతుగా వ్యవసాయ పనుల్లో పాల్గొంటూనే తాను అభిమానించే పార్టీపై ఉన్న అనుబంధాన్ని సృజనాత్మకంగా వ్యక్తపరిచారు. పచ్చని వరి చేనులో స్పష్టంగా కనిపించేలా "బీజేపీ " అక్షరాలను అమర్చడం స్థానికంగా అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ దృశ్యాన్ని చూసేందుకు రైతులు, గ్రామస్థులు ఆసక్తి చూపగా, పలువురు ఫొటోలు, వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటున్నారు. వ్యవసాయంతో పాటు పార్టీపై తనకున్న అభిమానాన్ని వినూత్నంగా ప్రదర్శించిన సర్పంచ్ మాచర్ల కుమారస్వామి చర్య ప్రస్తుతం మండలంలో చర్చనీయాంశంగా మారింది



# నీతి, నిజాయితీ, నిర్భీతితో వృత్తి గౌరవాన్ని నిలబెట్టుకున్న వారే నిజమైన జర్నలిస్టులు



ప్రజల ఆకాంక్షాలకు అనుగుణంగా, నీతి, నిజాయితీ, నిర్భీతితో పనిచేస్తూ, వృత్తి గౌరవాన్ని నిలబెట్టుకునేవారే నిజమైన జర్నలిస్టులని, అలాంటి వారినే సమాజం అక్కున చేర్చుకుంటుందని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు బషీర్ బాగ్ లోని సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో, తెలంగాణ వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన కృతజ్ఞత సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గతంలో అక్రెడిటేషన్ కార్డులను కొందరు అంగట్లో సరుకుగా మార్చి, దాని విలువ లేకుండా చేసారని, ఈ చర్య వల్ల సమాజంలో దుష్పరిణామాలు చోటు చేసుకున్నాయని శ్రీనివాస్ రెడ్డి విచారం వ్యక్తం చేసారు. అక్రెడిటేషన్ అనేది వృత్తి గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలన్నారు. మీడియా రంగాన్ని కలుషితం చేస్తూ అపహాస్యానికి గురిచేస్తున్న వారిని గుర్తించి, వారికి తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మీడియాలో చోటు చేసుకుంటున్న పరిణామాలను ఆసరగా చేసుకుంటూ, ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం జర్నలిస్టులు సాధించుకున్న సౌకర్యాలను, చట్టాలను రద్దు చేసేస్తుందని, ఆ చర్యలను అడ్డుకోవాలంటే జర్నలిజం వృత్తి నిబద్ధతను మనం నిరూపించుకోవాల్సి ఉంటుందని ఆయన సూచించారు. సామాన్యుల భావప్రకటన స్వేచ్ఛకు సోషల్ మీడియా మంచి వేదిక అయినప్పటికీ, అందులో మంచితో సమానంగా చెడు, కల్పితాలు, అవాస్తవాలు ట్రోల్ అవుతుండడంటో దానికి విలువ లేకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. ఈ నేపథ్యంతోనే దేశంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం సవరిస్తూ కఠినమైన నిర్ణయాలను తీసుకోబోతుందని ఆయన అప్రమత్తం చేసారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో వీడియో జర్నలిస్టులు సంఘటితమై బలమైన సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఫోటో గ్రఫీ డే మాదిరిగానే వీడియో గ్రఫీ డే ను కూడా నిర్వహించడానికి అకాడమీ యోచిస్తుందన్నారు. ఏఐ ను తట్టుకొని నిలబడే విధంగా వీడియో జర్నలిస్టులకు అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను నిర్వహిస్తామని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేనివిధంగా వీడియో జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు, సంక్షేమానికి తమ సంఘం కృషి చేస్తున్నట్లు ఆయన అన్నారు. ఆయా మీడియా సంస్థల్లో పనిచేస్తున్న వీడియో జర్నలిస్టులతో పాటు ఫ్రీలాన్స్ వీడియో జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాలు వర్తింపజేసేందుకు తాము నిరంతరం కృషి చేస్తామని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వీడియో జర్నలిస్టులను తెలంగాణ ఉద్యమకారులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని విరాహత్ అలీ కోరారు. తెలంగాణ వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు హరీష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సన్నీ, అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు, రాష్ట్ర అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు వనం నాగరాజు, టీయుడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. కిరణ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షులు యూసుఫ్ బాబు, ప్రధాన కార్యదర్శి అశోక్, తెలంగాణ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఫ్రీలాన్స్ వీడియో జర్నలిస్టులకు మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా అక్రెడిటేషన్ కార్డుల ప్రధానోత్సవం జరిగింది.



# గృహోపకరణాల యూనిట్ ఏర్పాటు చేయండి
## కుకూ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులతో మంత్రి లోకేశ్

రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ఏపీ మంత్రి నారా లోకేశ్ దక్షిణకొరియా పర్యటన ఆరోరోజు కొనసాగుతోంది. ఈ సందర్భంగా గృహోపకరణాలు, నీరు, గాలి శుద్ధి పరికరాల సంస్థ కుకూ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులతో మంత్రి భేటీ అయ్యారు. శ్రీసిటీలోని గృహోపకరణాల క్లస్టర్‌లో అంబర్, ఈప్యాక్ డ్యూరబుల్, డైకిన్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ మొదలైనవి సంస్థలు ఉన్నాయని లోకేశ్ తెలిపారు. దేశంలో 40శాతం ఏసీలు, 35శాతం టీవీలు ఆంధ్రప్రదేశ్‌లో తయారవుతున్నాయన్నారు. ఇందుకు అవసరమైన స్కిల్డ్ వర్క్ ఫోర్స్ అందుబాటులో ఉందని వివరించారు. ఇక్కడి నుంచి ఆగ్నేయ, మధ్యప్రాచ్య దేశాలకు ఎగుమతి చేయడం సులభమన్నారు. దక్షిణ భారతదేశంలో ఏసీల వినియోగం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రపంచ వాణిజ్యానికి భారతదేశం ఒక విశ్వసనీయ తయారీ భాగస్వామిగా ఉందని తెలిపారు. ఈ అనుకూలతల దృష్ట్యా ఆంధప్రదేశ్‌లోని శ్రీసిటీలో లేదా తిరుపతిలో.. గృహోపకరణాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాల్సిందిగా మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలు పరిశీలిస్తామని కుకూ ఎలక్ట్రానిక్స్ హెచ్‌వోడీ చెప్పారు. దక్షిణ కొరియాకు చెందిన ఆటోమోటివ్ పవర్ ఎలక్ట్రానిక్స్, పాసివ్ కాంపొనెంట్స్ తయారీ సంస్థ మోటివ్ లింక్ సీఈవో కిమ్ కి-హాన్ , ఇంటర్నేషనల్ సేల్స్ అండ్ రీసెర్చ్ జనరల్ మేనేజర్ బైద్య శర్మతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com